E69 NEWS
# తెలుగు గళం
సామాన్యుల గుండె చప్పుడు    జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను
E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో
పని చేయుటకు నియోజకవర్గాలవారిగా
విలేకరులు కావలెను వాట్సప్ నెం:
9959812941-9949356387

PUBLISHED: TELANGANA  సంపుటి : 01  సంచిక : 120  మంగళవారం, ఏప్రిల్ 07, 2026  ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్  పేజీలు: 08  వెల :05/-

## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

భూమి నుంచి రికార్డు దూరంలో
1970లో అపోలో
13 కంటే 2,500 కి.మీ అదనం
10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ అయ్యే అవకాశం : శాస్త్రవేత్తలు




## తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

త్వరలో ముసాయిదాపై స్పందిస్తాం : ఇరాన్
హోర్ముజ్‌పై గుత్తాధిపత్య శకం ముగిసిందని స్పష్టీకరణ
ఇరాన్ ఇంటెలిజెన్స్ చీఫ్ మృతి
తాజా భీకర దాడుల్లో 34 మందికి పైగా మరణం
అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరపం : ఇరాన్




## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

- పరిశీలన అనంతరం సంతకం చేసే అవకాశం



న్యూఢిల్లీ,ఏప్రిల్ 06 : రాజధాని అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పించే దిశగా కీలక ముందడుగు పడింది. పార్లమెంట్ ఉభయ సభల ఆమోదం పొందిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన మిగతా2లో...

# ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా...

తుమ్మడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి
ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి
పిప్రిలో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



ఆదిలాబాద్,ఏప్రిల్ 06 : గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి మిగతా2లో...

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

ఆనాటి నేతలు...నేటి మోడీతో మరింత బలోపేతం
47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్



అమరావతి,ఏప్రిల్ 06 : బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, మిగతా2లో...



## ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

- అమలు దిశగా కీలక అడుగులు వేస్తున్నాం
- పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,ఏప్రిల్ 06 : భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా మిగతా2లో...

## హామీలను అమలు చేసిన ఘనత మాది

- పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం
- మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క



ఆదిలాబాద్,ఏప్రిల్ 06 : అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు మిగతా2లో...

## భారతీయ యువత ఉద్యోగాలు సృష్టించే వారుగా ఎదగాలి : కేటీఆర్




హైదరాబాద్,ఏప్రిల్ 06 :భారతీయ యువత కేవలం ఉద్యోగాల కోసం వెతికేవారుగా కాకుండా, పారిశ్రామికవేత్తలుగా మారి ఉద్యోగాలను సృష్టించేవారుగా ఎదగాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీ రామారావు పిలుపునిచ్చారు. అమెరికాలోని ప్రతిష్టాత్మక కొలంబియా యూనివర్సిటీలో నిర్వహించిన 'ఫైర్‌సైడ్ చాట్'లో ఆయన పాల్గొని ప్రసంగించారు.భారత్ ఆర్థిక గమనం, కృత్రిమ మేధ, వ్యవస్థాపకత, మారుతున్న ఉద్యోగ రంగాలపై తన లోతైన విశ్లేషణలను విద్యార్థులతో పంచుకున్నారు. న్యూయార్క్ నగరంలోని కొలంబియా బిజినెస్ స్కూల్ వార్షిక సదస్సులో ప్రసంగించిన అనంతరం ప్రత్యేక చర్చ గోష్టిలో కేటీఆర్ పాల్గొన్నారు. ఐటీ, పారిశ్రామిక రంగాలు, భారతదేశ ప్రగతి, నిరుద్యోగం, యువత, గెలుపు ఓటముల వంటి అనేక అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు.గడిచిన దశాబ్ద కాలంలో భారత్ భౌతిక, డిజిటల్ మౌలిక సదుపాయాల రంగంలో అద్భుతమైన ప్రగతిని సాధించిందని పేర్కొన్నారు. 3జీ, 4జీ, 5జీ వంటి టెలికాం సాంకేతికతలను భారత్ ప్రపంచ దేశాల కంటే ముందుగానే అందిపుచ్చుకుందని గుర్తుచేశారు. అయితే, ఇప్పుడు భారత్ ఒక కీలక దశలో ఉందని, ఇతర దేశాల అభివృద్ధి నమూనాలను యథాతథంగా కాపీ కొట్టే పరిస్థితి లేదని అన్నారు. సొంతంగా, వినూత్నంగా ఆలోచించాల్సిన సమయం ఆసన్నమైందని స్పష్టం చేశారు.ఏఐ ముప్పు పొంచి ఉంది..ఏఐ ముప్పు పొంచి ఉందని, అప్రమత్తత అవసరమని కేటీఆర్ సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పెను మార్పులు తీసుకురాబోతోందని కేటీఆర్ హెచ్చరించారు. ఏఐ వల్ల రాబోయే రోజుల్లో మిలియన్ల కొద్దీ ఉద్యోగాలు ప్రభావితమవుతాయి. ఈ ముప్పు వాస్తవం. చాలా దగ్గరలో ఉంది. ఈ మార్పును తట్టుకోవ డానికి ప్రభుత్వాలు కానీ, సమాజం కానీ ఇంకా సిద్ధంగా లేవని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ విప్లవాన్ని తట్టుకోవాలంటే యువత నిరంతరం తమ నైపుణ్యాలను మెరుగుపరుచు కోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా తమను తాము మలచుకోవాలని సూచించారు. తాజాగా ఒరాకిల్ సంస్థ భారీ ఎత్తున ఉద్యోగులను తొలగించిన అంశాన్ని కేటీఆర్ ఈ సందర్భంగా ప్రస్తావించారు.హైదరాబాద్ తరహా ఇన్నోవేషన్ హబ్‌లు కావాలి..స్టార్టప్ వ్యవస్థ గురించి మాట్లాడుతూ హైదరాబాద్‌ను ఒక ఉదాహరణగా కేటీఆర్ చూపారు. మిగతా2లో...

## బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు
రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎస్ మాధవ్
పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు




# నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా

- పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ



హైదరాబాద్,ఏప్రిల్ 06:ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పోషకాహారంపై ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేళాలో సోమవారం సాయంత్రం మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి బల్కంపేటలోని నేచర్ క్యూర్ హాస్పిటల్‌లో ఈట్ రైట్ మేళాను నిర్వహించారు. ఈట్ రైట్ మేళాలో భాగంగా ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను మంత్రి సందర్శించారు. నాణ్యమైన, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాలతో పలువురు ఫుడ్ వెంటర్స్ స్టాల్స్ ఏర్పాటు చేశారు. మి÷-లలెట్లతో తయారు చేసిన ఆహార పదార్థాలతో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మిలెట్స్‌తో తయారు చేసిన ఐస్ క్రీమ్, కాఫీ, తదితర పదార్థాలను మంత్రి రుచి చూసి, తయారీ పద్ధతిని అడిగి తెలుసుకున్నారు. పాలు, పండ్లు, కాయగూరలు, మసాల దినుసులు, చిరుధాన్యాలు, టీ పౌడర్ , పప్పు దినుసుల్లో కల్తీని ఎలా గుర్తించాలో మిగతా2లో...



## తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

- 9మంది పోలీసులకు మధురై కోర్టు ఉరిశిక్ష ఖరారు

చెన్నై,ఏప్రిల్ 06 : లాకప్ డెత్ కేసులో మధురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. బాధ్యులైన 9మంది పోలీసుకలు ఉరిశిక్ష విధిస్తూ తీర్పుని ఇచ్చింది. తమిళనాడులోని తూతుకుడి జిల్లా సాతాన్‌కుళంకు చెందిన తండ్రీ కుమారుల లాకప్ డెత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. తొమ్మిది మంది తమిళనాడు పోలీసులకు మరణశిక్ష విధించింది. 2020 జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన సమయానికి మించి మొబైల్ షాప్ నడిపారన్న ఆరోపణలతో యజమాని జయరాజ్, మిగతా2లో...

## బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**విజయవాడ,ఏప్రిల్ 06 :** ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుక ల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనక డుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోం దన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం పోస్టు చేశారు. 'భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకుల కు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో రెట్టింపు వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్.. ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తూ, సహకార సమాఖ్య స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది. పార్టీ అధ్యక్షుడు నితిన్ నబిన్ నాయకత్వంలో.. దేశ సేవలో బీజేపీ మరిన్ని విజయాలు సాధించాలని, 'వికసిత్ భారత్' లక్ష్యం దిశగా మన ప్రయాణాన్ని మరింత బలోపేతం చేయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అంటూ సీఎం చంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

## ఆదిలాబాద్‌కు గోదావరి నీరు పారిస్తా...

(మొదటి పేజీ తరువాయి)

భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పిప్రి నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు. ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా పిప్రిలో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు. గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్భందాలకు వ్యతిరేకంగా పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులు గా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్భంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## భారతీయ యువత ఉద్యోగాలు సృష్టించే వారుగా ఎదగాలి : కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

ఇంక్యుబేటర్లు, కో-వర్కింగ్ స్పేస్‌లు, మెంటార్ల ప్రోత్సాహం వల్లనే హైదరాబాద్ నుంచి అనేక 'యూనికార్న్' సంస్థలు పుట్టుకొచ్చాయని వివరించారు. దేశంలో వ్యవస్థాపకత పెరగాలంటే కేవలం పథకాలు ఉంటే సరిపోదని, ఒక పటిష్టమైన 'ఎకో సిస్టమ్' అవసరమని అభిప్రాయపడ్డారు.భారతదేశంలో ఉన్న యువ జనాభా ఒక శక్తి అని, అయితే అదే సమయంలో అది ఒక సవాలు అని అభిప్రాయపడ్డారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలంటే కేవలం అవకాశాలు కల్పిస్తే సరిపోదని, సరైన నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారు చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాలు, క్లీన్ ఎనర్జీ, లైఫ్ సైన్సెస్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాల్లో పబ్లిక్-ప్రైవేట్ పార్టనర్‌షిప్ ద్వారా అద్భుతమైన ఫలితాలను సాధించవచ్చని అన్నారు.

పెద్దగా కలలు కనండి, చిన్న విజయాలకు ఎప్పుడూ సంతృప్తి చెందకండని పిలుపు నిచ్చారు. జీవితంలో ఓటమికి భయపడవలసిన అవసరం లేదని, వైఫల్యం అనేది గెలుపు దిశగా సాగి ప్రయాణంలో ఒక భాగం మాత్రమే అని స్ఫూర్తిని నింపారు. ఆత్మవిశ్వాసం, పట్టుదల, ధైర్యంతో ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని విద్యార్థులకు సూచించారు .ఈ కార్యక్రమంలో కొలంబియా యూనివర్సిటీ విద్యార్థులు, మేధావులు, ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేటీఆర్

## నేచర్ క్యూర్‌లో ఈట్ రైట్ మేళా

(మొదటి పేజీ తరువాయి)

తెలుపుతూ ఫుడ్ సేఫ్టీ అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఆహార పదార్థాల్లో జరిగిన కల్తీని ఎలా గుర్తించాలో, ఫుడ్ సేఫ్టీ అధికారులు, సైంటిస్టులు మంత్రికి వివరించారు. ఆయా పద్ధతులను ప్రజల్లోకి తీసుకెళ్లి, వారికి అవగాహన కలిగేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని ఈ సందర్భంగా ఆరోగ్యశాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఇప్ప పువ్వుతో లడ్డులు, ఇతర ఆహార పదార్థాలను తయారు చేసి.. సక్సెస్‌ఫుల్‌గా బిజినెస్ రన్ చేస్తున్న మహిళా సంఘం సభ్యురాలిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం అమలు చేస్తున్న, ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. స్టాళ్ల సందర్శన అనంతరం జరిగిన సభలో స్ట్రీట్ ఫుడ్ వెండర్స్‌కు మంత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు అందించారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటిస్తూ, ఆహార నాణ్యత ప్రమాణాలు పాటిస్తున్న పలు హోటళ్లు, రెస్టారెంట్ల ప్రతినిధులకు హైజీన్ సర్టిఫికెట్లను మంత్రి అందజేశారు. ఫుడ్ సేఫ్టీ - న్యూట్రీషియస్ ఫుడ్ ట్రైనింగ్‌లో పాల్గొన్న వారికి పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏం తినాలో, ఎంత తినాలో తెలుసుకోవడం ఎంత ముఖ్యమో, మనం తింటున్న ఆహార నాణ్యత గురించి తెలుసుకోవడం కూడా అంతే ముఖ్యం అని పేర్కొన్నారు. 'మంచి ఆహారపు అలవాట్ల గురించి, ఆరోగ్యకరమైన ఆహార పదార్థాల గురించి తెలుసుకోవడానికి ఈట్ రైట్ మేళా వంటి కార్యక్రమాలు ఇందుకు ఎంతో దోహదపడుతాయి. ఆరోగ్యం బాగున్నప్పుడే, జీవితం ఆనందంగా ఉంటుందన్న విషయాన్ని బిజీ లైఫ్‌లో పడి మనం మర్చిపోతున్నాం. డబ్బు, ఉద్యోగం, సౌకర్యాలు అన్నీ ఉన్నా? ఆరోగ్యం లేకపోతే వాటికి విలువ ఉండదు. ఇటీవలి కాలంలో మన ఆహారపు అలవాట్లు మారిపోయాయి. బయట ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్ వినియోగం పెరిగింది. దీంతో పాటు, శారీరక శ్రమ, ఫిజికల్ యాక్టివిటీ తగ్గిపోయింది. ఇది ఆందోళన కలిగించే విషయం. రోజూ కనీసం 30 నిమిషాలైనా వ్యాయామం చేయడం చాలా అవసరం. వాకింగ్, యోగా, గేమ్స్... ఏదైనా ఒకటి మన నిత్య జీవితంలో భాగం కావాలి. శరీరం కదిలితేనే ఆరోగ్యం బాగుంటుంది. శారీరక ఆరోగ్యం మాత్రమే కాదు.. మానసిక ప్రశాంతత కూడా అంతే ముఖ్యమైనది.ఈ పరిస్థితుల్లో, 'ఈట్ రైట్' అనే భావన చాలా కీలకం. మనము తినే ఆహారమే, మన ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది కాబట్టి, ఏం తినాలో, ఎక్కడ తినాలో ప్రజలు తెలుసుకోవాలి. వీలైనంత వరకూ ఇంట్లో వండిన ఆహార పదార్థాలనే తినడం మంచిది. ఆహారంతో పాటు ప్రతిరోజు వ్యాయామం చేయాలి, మనసుకు ప్రశాంతత కలిగించే జీవనశైలిని అలవరచుకోవాలి. ఆహార కల్తీ జరుగుతున్నట్టు మీ దృష్టికి వస్తే, వెంటనే పోలీసులకు లేదా ఫుడ్ సేఫ్టీ అధికారులకు లేదా ఆరోగ్యశాఖ అధికారులకు సమాచారం ఇవ్వండి. తక్షణమే కఠిన చర్యలు తీసుకునే బాధ్యత మాది.' అని మంత్రి ప్రజలకు సూచించారు.

## హామీలను అమలు చేసిన ఘనత మాది

(మొదటి పేజీ తరువాయి)



పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.

## జాబిల్లి చెంతకు ఆర్టెమిస్2

**న్యూయార్క్ ,ఏప్రిల్ 06 :**అమెరికా అంతరిక్ష సంస్థ-నాసా చేపట్టిన ఆర్టెమిస్-2 యాత్ర కీలక దశలోకి చేరింది. ఈ మిషన్‌లో భాగంగా నలుగురు వ్యోమగాములు చంద్రుడి గురుత్వాకర్షణ పరిధిలోకి ప్రవేశించారు. వారిని తీసుకెళ్లిన ఒరాయన్ వ్యోమనౌక.. 4,06,773కి.మీ దూరం ప్రయాణించి అత్యంత సుదూర మానవ అంతరిక్ష యాత్రగా రికార్డు సృష్టించింది. 1970లో అపోలో 13 ప్రయాణించిన దూరం కంటే ఇది 2,500 కి.మీ అదనం కావడం గమనార్హం.ఈ క్రమంలోనే 'లూనార్ ఫ్లైబై' దశ చోటుచేసుకోనుంది. ఆ విన్యాసంతో ఒరాయన్.. చందమామను దాటి 6,400 కిలోమీటర్లు దూరం వెళుతుంది. ఈ క్రమంలో.. మనకు ఎప్పుడూ కనిపించని చంద్రుడి రెండో పార్శ్వాన్ని వ్యోమగాములు క్లిక్ మనిపిస్తారు. చంద్రుడి చుట్టూ ప్రయాణం పూర్తి చేశాక ఈ వ్యోమనౌక భూమి వైపు మళ్లుతుంది. ఈ నెల 10న పసిఫిక్ మహాసముద్రంలో ల్యాండింగ్ ఉండొచ్చని శాస్త్రవేత్తలు తెలిపారు.

## తాత్కాలిక కాల్పుల విరమణకు 'నో'

**టెహ్రాన్,ఏప్రిల్ 06 :**పశ్చిమాసియాలో దాదాపు నలభై రోజులుగా కొనసాగుతున్న యుద్ధాన్ని తాత్కాలికంగా విరమించేందుకు ఇరాన్ సుముఖంగా లేదని ఓ సీనియర్ ఇరాన్ అధికారి తెలిపారు. కాల్పుల విరమణకు సంబంధించిన ముసాయిదా ప్రణాళిక ఇరాన్‌కు అందిందని ఆయన సోమవారం వెల్లడించారు. తాత్కాలిక కాల్పుల విరమణకు ప్రతిగా హోర్ముజ్‌ను తిరిగి తెరిచే ప్రశ్నే లేదని స్పష్టం చేశారు. శాశ్వతంగా కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి అమెరికా సంసిద్ధంగా లేదని ఇరాన్ భావిస్తోందని అన్నారు. కాగా రెండంచెల ముసాయిదా ప్రణాళికను పాకిస్తాన్ గత రాత్రి ఇరుపక్షాలకు అందజేసింది. ముందుగా తక్షణమే కాల్పుల విరమణను ప్రకటించి, ఆ తర్వాత సమగ్ర ఒపందాన్ని కుదుర్చుకోవాలని ఆ ముసాయిదా పేర్కొంది. మధ్యవర్తుల ద్వారా ఇటీవల తమకు అందిన కాల్పుల విరమణ ప్రతిపాదనలపై ఇరాన్ తన వైఖరిని తెలియజేసిందని, అల్టిమేటంలు, షరతులు, బెదిరింపులు ద్వారా చర్చలు జరగవని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘె స్పష్టం చేశారు. ఓ పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ జాతీయ ప్రయోజనాలకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యలు కొన్ని ఉన్నాయని, వాటిని ఇప్పటికే మధ్యవర్తుల ద్వారా తెలియజేశామని అన్నారు. అయితే ఇవి మితిమీరి ఉన్నాయంటూ అమెరికా పంపిన 15పాయింట్ల ప్రణాళికను ఇరాన్ ఇప్పటికే తిరస్కరించిందని తెలిపారు. చట్టబద్ధమైన తమ డిమాండ్లను స్పష్టంగా వివరించడంలో ఇరాన్ వెనుకాడబోదని అన్నారు. ఆ విధంగా చేయడాన్ని రాజీ సంకేతంగా భాష్యం చెప్పరాదని అన్నారు. దానికన్నా తమ వైఖరులను నిర్వచించడంలో తమ విశ్వాసాన్ని వ్యక్తీకరించడంగా చూడాలని తెలిపారు. త్వరలో మా స్పందనలు తెలియపరుస్తాం, వివరాలు వెల్లడిస్తామని ఆయన ప్రకటించారు. కాల్పుల విర మణ ప్రణాళికపై ఇరాన్ జర్నలిస్టు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఆయన పైవిధంగా చెప్పారు. కాగా అమెరికా నుంచి ఎలాంటి స్పందన వెలువడలేదు.పాకిస్తాన్‌విదేశాంగకార్యాలయ ప్రతినిధితాహిర్ అంద్రబి వ్యాఖ్యానించడానికి నిరాకరించారు.

## రాష్ట్రపతి వద్దకు అమరావతి బిల్లు

(మొదటి పేజీ తరువాయి)

చట్ట సవరణ బిల్లు-2026.. సోమవారం రాష్ట్రపతి భవన్‌కు చేరుకుంది. లోక్ సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపింది. పరిశీలన, న్యాయ నిపుణులతో సంప్రదింపుల అనంతరం రాష్ట్రపతి ఆమోదం తెలపనున్నారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం ఇది చట్టరూపం దాల్చనుంది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్ట సవరణ 2026 బిల్లుకు పార్లమెంట్ ఇటీవల ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. సుమారు ఐదు గంటల పాటు లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లుపై చర్చలు జరిగాయి. ఎలాంటి సవరణలు లేకుండానే బిల్లుకు ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. ఉభయ సభల ఆమోదం తర్వాత లోక్‌సభ సచివాలయం ఈ బిల్లును రాష్ట్రపతి వద్దకు పంపింది. ఇవాళ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేసే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఈ బిల్లు రాష్ట్రపతి పరిశీలనలో ఉంది. రాజ్యగ నిబంధనల ప్రకారం న్యాయనిపుణులతో సంప్రదింపులు జరిపిన అనంతరం రాష్ట్రపతి సంతకం చేయనున్నారు. రాష్ట్రపతి ఆమోదం తర్వాత హిందీ, ఆంగ్ల భాషల్లో గెజిట్ నోటిఫికేషన్ వెలువడనుంది.

## ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బిజెపి

(మొదటి పేజీ తరువాయి)

ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్థవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

## ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

(మొదటి పేజీ తరువాయి)

అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు. 2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు.

## తమిళనాడులో తండ్రీ కొడుకుల లాకప్‌డెత్ కేసు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన కుమారుడు బెనిక్స్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కస్టడీలో ఉన్న వారిని తీవ్రంగా హింసించడంతో ఇద్దరూ చనిపోయారు. ఈ ఘటనకు పాల్పడిన తొమ్మిది మంది పోలీసులపై ఉన్నతాధి కారులు కేసు నమోదు చేశారు. ఈ కేసుపై విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తాజాగా తీర్పు వెలువరించింది. కొవిడ్ కారణంగా 2020లో దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ విధించిన విషయం తెలిసిందే. అదే ఏడాది జూన్ 19న లాక్‌డౌన్ సమయంలో అనుమతించిన దానికంటే ఎక్కువ సేపు మొబైల్ షాప్ తెరిచి ఉంచినందుకు స్థానిక వ్యాపారి జయరాజ్, అతడి కుమారుడు బెనిక్స్‌లను పోలీసులు అరెస్టు చేశారు. వారిద్దరినీ సత్తాన్‌కులం పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి.. ఆ తర్వాత జ్యుడిషియల్ కస్టడీకి తరలించారు. జూన్ 23న కొన్ని గంటల వ్యవధిలో ఇద్దరూ మరణించారు. పోలీసులు రాత్రంతా వారిని తీవ్రంగా కొట్టి హింసించడం వల్లే వారు చనిపోయారని కుటుంబసభ్యులు ఆరోపించారు. దీంతో ఆ సమయంలో డ్యూటీలో పోలీసులను సీబీఐ అధికారులు అరెస్టు చేసి, దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో తండ్రీ కుమారులపై పోలీసులు మోపిన అభియోగాలు కూడా అబద్ధమని తేలింది. ఈ కేసులో ఒక మహిళా కానిస్టేబుల్ ఇచ్చిన వాంగ్మూలం కీలకంగా మారింది. తండ్రీకొడుకులపై రాత్రంతా దాడి జరిగిందని.. స్టేషన్‌లోని బల్లలు, లాఠీలపై రక్తపు మరకలు ఉన్నాయని ఆమె వెల్లడించింది. ఈ విషయం బయటకు రాకుండా ఉండేందుకు సీసీటీవీ రికార్డింగ్‌లు ప్రతిరోజూ ఆటోమేటిక్‌గా డిలీట్ అయ్యేలా పోలీసులు సెట్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పోలీసులు పెట్టిన హింస వల్లే తండ్రీకుమారులు మరణించినట్లు ధ్రువీకరించారు.

# తమ్మడపల్లి జి గ్రామంలో మత్తు పదార్థాలు, పేకాటపై కఠిన నిషేధం

**- గ్రామ సమగ్ర అభివృద్ధే లక్ష్యం-గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి**



**తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ ఏప్రిల్ 06**
జనగామ జిల్లా జఫర్గఢ్ మండలం తమ్మడపల్లి (జి) గ్రామంలో గ్రామ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని గుట్కా, తంబాకు, గంజాయి వంటి మత్తు పదార్థాలు మరియు పేకాటపై సంపూర్ణ నిషేధం విధించినట్లు గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి తెలిపారు.గ్రామ ప్రజలకు ఇచ్చిన హామీలో భాగంగా, గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలంటే చెడు అలవాట్లను పూర్తిగా నిర్మూలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇటీవల గ్రామంలో పేకాట విస్తరిస్తోందని,అలాగే మత్తు పదార్థాల వినియోగం పెరుగుతోందని ఆందోళన వ్యక్తం అవడంతో ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ, "గ్రామ అభివృద్ధే మా ప్రధాన లక్ష్యం. యువత చెడు అలవాట్లకు లోనుకాకుండా దూరంగా ఉండి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలి. కుటుంబ బాధ్యతలను గుర్తించి సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలి" అని అన్నారు.ఇకపై గ్రామంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు గుర్తిస్తే, ఆడిన వారి పేర్లను యువత గ్రూపుల్లో వెల్లడిస్తామని హెచ్చరించారు.యువత తమ విలువైన సమయాన్ని వృథా చేసుకోకుండా విద్య, ఉపాధి, కుటుంబంపై దృష్టి పెట్టాలని సూచించారు.గ్రామంలోని కొంతమంది వ్యాపారస్తులు రహస్యంగా గుట్కా, తంబాకు వంటి నిషేధిత పదార్థాలను విక్రయిస్తున్నట్లు గ్రామ పంచాయతీ దృష్టికి వచ్చినందున, వెంటనే అలాంటి విక్రయాలను పూర్తిగా నిలిపివేయాలని ఆదేశించారు.ఈ ఆదేశాలను ఉల్లంఘించిన పక్షంలో గ్రామ పంచాయతీ మరియు పోలీసు శాఖ ద్వారా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, భవిష్యత్తులో గ్రామ పంచాయతీ నుంచి ఎలాంటి సహకారం అందించబడదని స్పష్టం చేశారు.గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి మంచి మార్గంలో నడవాలని కమిటీ పిలుపునిచ్చింది.తమ్మడపల్లి జి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ ఒకటిగా ముందుకు రావాలని కోరారు.

# అధిక లోడ్‌తో బొలేరో టైర్లు పేలి రాకపోకలకు అంతరాయం

**-- నాయుడు పెట్రోల్ పంపు సమీపంలో ఘటన**




**తెలుగు గళం న్యూస్, వరంగల్, ఏప్రిల్ 6**
వరంగల్ జిల్లా నాయుడు పెట్రోల్ పంపు సమీపంలో అధిక లోడ్‌తో వెళు న్న బొలేరో వాహనం టైర్లు పేలిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది .ఎండాకాలంలో పెరిగిన ఉష్ణోగ్రత లకు తోడు వాహనాల్లో అనుమతికి మించి లోడ్ మోపడం వల్ల టైర్లు తట్టుకోలేక రోడ్డు మధ్యలోనే పేలిపోయినట్లు స్థానికులు తెలిపారు.ఈ ఘటనతో భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలు కూడా మధ్యలోనే నిలిచిపోవడంతో ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.కొంతసమయం పాటు రహదారిపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయినట్లు సమాచారం.ఇక ఆగి ఉన్న వాహనాన్ని క్రాస్ చేసే క్రమంలో కారు, బైక్ ఒకదానికొకటి ఢీకొని ప్రమాదం చోటుచేసుకుంది.ఈ ప్రమాదంలో స్వల్ప గాయాలు అయినట్లు తెలుస్తోంది.ఈ పరిస్థితిపై ప్రజలు, వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తూ రవాణా శాఖ అధికారులను తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. అధిక లోడ్ తో వెళ్ళే వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవడం, ఫిట్‌నెస్ లేని వాహనాలను రోడ్లపైకి అనుమతించకూడదని సూచిస్తున్నారు.అలాగే వాహనదారులు కూడా లోడ్ పరిమితులను పాటిస్తూ, టైర్ల పరిస్థితిని తరచూ పరిశీలించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# రేగొండ శివారులో రోడ్డు ప్రమాదం

**- గాయపడిన వారికి ఎస్సై సుధాకర్ సహాయం**





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండల శివారులోని గంగరావు చెరువు సమీపంలో సోమవారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది.రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో మూడు మంది తీవ్రంగా గాయపడ్డారు.ఈ ప్రమాదంలో గాంధీనగర్‌కు చెందిన దొంగల చందు (27), రంగయ్యపల్లి గ్రామానికి చెందిన సిల్ వేరు పైడి (50), సీతారాంపురం గ్రామానికి చెందిన కుమార్ యాదవ్ (48) గాయపడ్డారు. వీరికి కాళ్లు విరగడం తో పాటు తలకు గాయాలు అయినట్లు సమాచారం.ప్రమాదం జరిగిన వెంటనే అంబులెన్స్ అందుబాటులో లేకపోవడంతో రేగొండ ఎస్సై సుధాకర్ మానవతా దృక్పథంతో స్పందించారు.తన సొంత వాహనంలో గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేశారు.ఎస్సై సుధాకర్ చేసిన ఈ సహాయానికి స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.సమయస్ఫూర్తితో స్పందించి గాయపడిన వారికి తక్షణ చికిత్స అందేలా చేసిన పోలీస్ అధికారిపై ప్రజలు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

# నవ తెలంగాణ వికలాంగుల ఫోరం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ సలీం పాషా నియామకం





**తెలుగు గళం న్యూస్ హనుమకొండ, ఏప్రిల్ 06**
నవ తెలంగాణ రాష్ట్ర వికలాంగుల ఫోరం ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లాలోని 29వ డివిజన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో సయ్యద్ సలీం పాషా ను జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షులు ఇప్ప శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉమ్మడి వరంగల్ జిల్లా దివ్యాంగుల అధ్యక్షులు బండి చక్రపాణి, భద్రకాళి దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు ఓరుగంటి పూర్ణ, జిల్లా కాంగ్రెస్ సీనియర్ మహిళా నాయకురాలు సుతారి కళ్యాణి, డివిజన్ మైనార్టీ అధ్యక్షులు అబ్దుల్ అలీమ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు ఇప్ప శ్రీకాంత్ మాట్లాడుతూ, సయ్యద్ సలీం పాషా గత కొంతకాలంగా దివ్యాంగులు మరియు మైనార్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ వారికి అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. అదేవిధంగా "స్టేట్ డెవలప్మెంట్ ఆర్గనైజేషన్" కార్యక్రమం ద్వారా డివిజన్‌లలోని పలు సమస్యలను పరిష్కరించడంలో విశేషంగా సేవలందిస్తున్నారని తెలిపారు. వారి సేవలను గుర్తించి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించినట్లు వెల్లడించారు.అనంతరం సయ్యద్ సలీం పాషా మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు ఎండి అజీమ్ కు, జిల్లా అధ్యక్షులు ఇప్ప శ్రీకాంత్ కు, అలాగే బండి చక్రపాణి కు కృతజ్ఞతలు తెలిపారు.తన పదవిని నిబద్ధతతో నిర్వహిస్తూ, దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, సంస్థ నియమ నిబంధనలకు లోబడి అవినీతి రహితంగా సేవలు అందిస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా మరియు డివిజన్ స్థాయి దివ్యాంగ నాయకులు పాల్గొన్నారు

# కార్మికోద్యమానికి దిక్సూచి బిటీఆర్ -- వర్ధంతి సభలో వక్తల ప్రశంసలు



**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్ ఏప్రిల్ 06**
హైదరాబాద్‌లో నిర్వహించిన బిటీఆర్ 36వ వర్ధంతి సభలో వక్తలు ఆయనను కార్మికోద్యమానికి మార్గదర్శిగా కొనియాడారు. కార్మిక హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం, క్రమశిక్షణ, సిద్ధాంత నిబద్ధత నేటి తరానికి ఆదర్శమని పేర్కొన్నారు.సోమవారం సిఐటియు రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఉపాధ్యక్షులు ఆర్. సుధాభాస్కర్, ఎస్. వీరయ్య తదితరులు బిటీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.చుక్క రాములు మాట్లాడుతూ బిటీఆర్ భారత కార్మికోద్యమానికి స్పష్టమైన దిశానిర్దేశం చేసిన మహానేత అని తెలిపారు. ఆయన సైద్ధాంతిక దృక్పథం, పోరాట పటిమ నేటి ఉద్యమాలకు మార్గదర్శకమని అన్నారు.సిఐటియు నిర్మాణం, బలోపేతంలో ఆయన పాత్ర విశేషమని గుర్తు చేశారు. కులం--వర్గం అంశాలపై ఆయన ఇచ్చిన అవగాహన నేటికీ ప్రామాణికమని చెప్పారు.ఆర్. సుధాభాస్కర్ మాట్లాడుతూ బిటీఆర్ క్రమశిక్షణకు ప్రతీక అని అన్నారు. పార్టీ చర్యలు ఎదురైనా సాధారణ సభ్యుడిగా పనిచేసి మళ్లీ ఉన్నత స్థానాలకు చేరుకున్న ఆయన తత్వం నేటి నాయకులకు ఆదర్శమని పేర్కొన్నారు.ఆయన రచనలను అధ్యయనం చేసి ఆచరించాలని సూచించారు.ఎస్. వీరయ్య మాట్లాడుతూ ఐక్యతా పోరాటాలకు బిటీఆర్ జీవంత ఉదాహరణ అని అన్నారు. కుల వివక్షకు వ్యతిరేకంగా వర్గపోరాటాన్ని అనుసంధానించిన నాయకుడిగా ఆయనను ప్రశంసించారు. కార్మిక వర్గ ఐక్యత ద్వారా సామాజిక న్యాయం సాధ్యమని ఆయన చూపిన మార్గాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా వక్తలు బిటీఆర్ ఆశయాలను కొనసాగించడం అంటే కార్మికోద్యమాన్ని బలోపేతం చేయడమేనని, అదే ఆయనకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు.కార్యక్రమంలో పలువురు రాష్ట్ర కమిటీ సభ్యులు, ఆఫీస్ బేరర్స్ పాల్గొన్నారు.

# కామ్రేడ్ బీటీ రణదీవే 36వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు

**-- సిఐటియు ఆధ్వర్యంలో సిర్పూర్ టౌన్‌లో కార్యక్రమం**




**తెలుగు గళం న్యూస్ కుమురం భీం ఆసిఫాబాద్ ఏప్రిల్ 06**
కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ టౌన్ మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రముఖ కార్మికోద్యమ నాయకుడు కామ్రేడ్ బీటీ రణదీవే 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హమాలీ కార్మికుల అడ్డా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా సహా కార్యదర్శి వెలిశాల క్రిష్ణమాచారి మాట్లాడుతూ, బీటీ రణదీవే (బాలచంద్ర త్రయంబక రణదీవే) భారత కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రగామి నాయకుడిగా, కార్మిక వర్గ పోరాటాలకు దిక్సూచి అయిన మహనీయుడని కొనియాడారు. 1904 డిసెంబర్ 19న మహారాష్ట్రలోని బొంబాయిలో జన్మించిన ఆయన, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. బొంబాయిలో కార్మిక సంఘాలను స్థాపించి అనేక సమ్మెలు, పోరాటాలకు నాయకత్వం వహించిన గొప్ప యోధుడని పేర్కొన్నారు.1970లో స్థాపితమైన సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు)కు స్థాపక అధ్యక్షుడిగా 1991 వరకు సేవలందిస్తూ కార్మిక హక్కుల పరిరక్షణలో అపార కృషి చేశారని గుర్తుచేశారు. వ్యక్తిగత జీవితాన్ని పక్కనపెట్టి, కార్మిక వర్గ ప్రయోజనాల కోసం అహర్నిశలు శ్రమించిన నిస్వార్థ నాయకుడని తెలిపారు.తన తండ్రి అంత్యక్రియలకు కూడా వెళ్లకుండా కార్మిక పోరాటంలో నిమగ్నమైన ఆయన త్యాగస్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని అన్నారు.ఇప్పటికీ ఆయన ఆలోచనలు, ఆశయాలు సమాజానికి మార్గదర్శకంగా ఉన్నాయని, అయితే నేటి పాలకుల ప్రజావ్యతిరేక విధానాల వల్ల కార్మిక చట్టాలు, హక్కులు క్షీణిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు కార్పొరేట్ శక్తులు అపార సంపదను కూడబెట్టుకుంటుండగా, మరోవైపు పేదరికం, నిరుద్యోగం, రైతుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని అన్నారు. ఈ పరిస్థితుల్లో కార్మిక వర్గం ఐక్యంగా పోరాడటం ద్వారానే బీటీ రణదీవేకు నిజమైన నివాళి అర్పించినట్టవుతుందని పిలుపునిచ్చారు.

# వరంగల్ లో ఘనంగా భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు






**తెలుగు గళం న్యూస్ వరంగల్ ఏప్రిల్ 06**
భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని వరంగల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు.వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 43వ డివిజన్‌లో, నాయుడు పంప్ సమీపంలో బీజేపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవి కుమార్ పార్టీ జెండాను ఆవిష్కరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదని, దేశ పునర్నిర్మాణం మరియు సాంస్కృతిక విలువల పరిరక్షణ లక్ష్యంగా ఏర్పడిన గొప్ప ఉద్యమమని పేర్కొన్నారు.సుమారు 200 సంవత్సరాల బ్రిటిష్ పాలనలో అణచివేయబడ్డ సనాతన ధర్మాన్ని, జాతీయ సాంస్కృతిక భావజాలాన్ని తిరిగి ప్రతిష్ఠించడమే బీజేపీ ప్రధాన ధ్యేయమని తెలిపారు. భారతమాత పూలదండలో ప్రతి జాతి, ప్రతి సంస్కృతి ఒక పువ్వులాంటిదని, వాటన్నింటినీ ఏకం చేసి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు పార్టీ కృషి చేస్తోందని చెప్పారు.అలాగే, జనసంఘ్ కాలం నుండి నేటి వరకు అనేక మంది కార్యకర్తలు, మహనీయులు చేసిన త్యాగాల ఫలితంగానే బీజేపీ నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరో కీలక మైలురాయి సాధించిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

- చారిత్రక ఆలయానికి కేంద్రం నుంచి భారీ నిధులు
- ఎంపీ డా.కడియం కావ్య పట్టుదలతో కాకతీయుల వైభవానికి పునర్జీవం
- పలుమార్లు కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞప్తి చేసిన ఎంపీ డా. కడియం కావ్య -- చివరకు ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు.
- కేంద్ర మంత్రికి, పురావస్తు శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేసిన వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య.


Government of India
Office of the Superintending Archaeologist
Archaeological Survey of India
Hyderabad Circle
Kendriya Sadan, II Block, 3rd Floor
Sultan Bazar, Hyderabad – 500 001
Ph: 040-24651012 circlehyderabad.asi@gov.in

F. No. VIPR/2025-26/M/ Date: 12 MAR 2026

To
The Director General
Archaeological Survey of India
Dharohar Bhawan
24, Tilak Marg, New Delhi – 110001

KIND ATTENTION: DIRECTOR (CONSERVATION), ASI, NEW DELHI

Sub: VIP Reference – Request for sanction of ₹10 crores towards the Site Development of the Thousand Pillar Temple, Hanamkonda – Reg.
Ref: Email received from the Director (Conservation), ASI, New Delhi on 29.01.2026.

Sir,

With reference to the subject cited above and with regard to the VIP reference raised by Dr. Kadiyam Kavya, Hon'ble Member of Parliament, Lok Sabha, Warangal IC-399 vide Lr. No. MP WGL (TG)/167/2025; Dated: 24-12-2025 towards sanction of funds for undertaking the Site Development of the Thousand Pillar Temple, Hanamkonda under the jurisdiction of ASI, Hyderabad Circle, it is to submit that the ASI, Hyderabad Circle has already taken up certain works such as reinstalling the central stone in the Kalyana Mandapa.

Further, a DPR has been prepared for the holistic development of the monument and the same has been submitted to the Director (Conservation) and the Director (Monuments) vide Letter No. TPT/GEN-CORRESP/2025-26/M/1118; Dated: 08.09.2025 (copy enclosed as Annexure – I). This office has also proposed certain works to be taken up in the Financial Year 2026-27 (details enclosed as Annexure – II).

Accordingly, the proposed works as mentioned in the attachment will be taken up during the next Financial Year 2026-27 following proper procedure after due approval is received from the Directorate, ASI, New Delhi.

This is for your kind information and consideration.

Yours faithfully

(Dr. Nihildas. N)
Superintending Archaeologist

Encl: Annexure – I & II

Copy for kind information to:-
- The Regional Director (South), ASI, Bengaluru.



**తెలుగు గళం న్యూస్ హన్మకొండ ఏప్రిల్ 06**
వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మరో కీలక మైలురాయిని సాధించారు.చారిత్రక ప్రాధాన్యం కలిగిన హనుమకొండలోని రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల గుడి అభివృద్ధి కోసం కేంద్రం నుంచి భారీ నిధులు మంజూరు కావడంలో ఎంపీ డా.కడియం కావ్య కృషి ఫలించింది.వేయి స్తంభాల ఆలయం, అదే ప్రాంగణంలోని కల్యాణ మండపం అభివృద్ధి, విస్తరణతో పాటు మిగిలిపోయిన పునరుద్ధరణ పనుల కోసం రూ.14.44 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో ఎంపీ కడియం కావ్య కీలక పాత్ర పోషించారు. ఈ నిధులతో కాకతీయుల కాలం నాటి శిల్ప వైభవాన్ని తిరిగి తీసుకురావడమే లక్ష్యంగా పనులు చేపట్టనున్నారు.గతంలో వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను పలుమార్లు కలిసి, వేయి స్తంభాల గుడి అభివృద్ధి అవసరాన్ని వివరిస్తూ ఎంపీ చేసిన నిరంతర ప్రయత్నాలే ఈ ఫలితానికి కారణం అయ్యాయి.గతంలో పురావస్తు శాఖ అధికారులతో కలసి స్వయంగా ఆలయాన్ని సందర్శించి, పునరుద్ధరణ అవసరాలను అధ్యయనం చేసిన ఎంపీ డాక్టర్ కడియం కావ్య, వెంటనే కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించారు.ఇటీవల కేంద్ర పురావస్తు శాఖ పనులకు టెండర్లు పిలవడంతో పనులు ప్రారంభానికి రంగం సిద్ధమైంది. ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య కేంద్ర మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌తో పాటు పురావస్తు శాఖ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి, ఆలయానికి పూర్వ వైభవం తీసుకురావాలని ఎంపీ విజ్ఞప్తి చేశారు. గత ఏడాది కేంద్ర మంత్రిని కలసి సుమారు రూ.15 కోట్ల నిధులు మంజూరు చేయాలని వినతి పత్రం అందజేసిన విషయం గుర్తు చేస్తూ, అందుకు సానుకూలంగా స్పందించిన కేంద్రం రూ.14.44 కోట్లు కేటాయించడం వరంగల్ అభివృద్ధికి శుభసూచకమని పేర్కొన్నారు. కాకతీయుల శిల్ప కళా సంపదకు ప్రతీకగా నిలిచిన వేయి స్తంభాల గుడి అభివృద్ధి ద్వారా పర్యాటక రంగం మరింతగా అభివృద్ధి చెందడంతో పాటు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుందని వరంగల్ ఎంపీ డా. కడియం కావ్య అన్నారు."వారసత్వాన్ని కాపాడుతూ అభివృద్ధి" అనే లక్ష్యంతో ముందుకు సాగుతూ వరంగల్ లో నూతన ప్రాజెక్టుల సాధన కోసం అహర్నిశలు కృషి చేస్తున్న వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య కు పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# ఆహార భద్రతపై ఫుడ్ హ్యాండ్లర్లు, అంగన్‌వాడీ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
భూపాలపల్లి ఐడీఓసీ కార్యాలయంలో సోమవారం బీసీ,ఎస్సీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న ఆహార నిర్వహణ సిబ్బంది (ఫుడ్ హ్యాండ్లర్లు)తో పాటు ఐసిడిఎస్ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో మొత్తం 150 మంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆహార భద్రత ప్రమాణాలు, పరిశుభ్రత పాటించే విధానం, పోషకాహార ప్రాముఖ్యత, ఆహార పదార్థాల సురక్షిత నిల్వ విధానాలు, వంట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. పిల్లలు మరియు విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు.అదేవిధంగా ఐసిడిఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు కూడా పంపిణీ చేశారు. ఈ సర్టిఫికెట్ల ద్వారా కేంద్రాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించబడే అవకాశముందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, ఆహార భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించడం ప్రతి ఆహార నిర్వాహకుడి బాధ్యత అని, ఈ శిక్షణ ద్వారా వారికి అవసరమైన జ్ఞానం, నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు.ఈ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ం

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**తెలుగు గళం న్యూస్ వర్ధన్నపేట రూరల్/ఏప్రిల్ 6**




వరంగల్ జిల్లా:వర్ధన్నపేట మండలం కడారి గూడెం. కట్ర్యాల గ్రామంలోని బూత్ నెంబర్ 227;228;229;లో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ జెండాను ఆయా బూత్ అధ్యక్షులు పింగిలి రాజేందర్ రెడ్డి. చిక్కొండ రాజు. శక్తి కేంద్రం ఇంచార్జ్ కుమార్ రాజా పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా నాయకులు కుందూరు మహేందర్ రెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యం లో కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గత 12 సంవత్సరాల నుంచి భారతదేశాన్ని సుభిక్షంగా సురక్షతంగా పరిపాలిస్తూ ప్రజలకు సబ్కా సాత్. సబ్కా వికాస్. సబ్కా విశ్వాస్. అనే నినాదంతో భారతదేశంలోని అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధి పథంలోకి నడిపిస్తూ శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను నెరవేర్చే విధంగా అంత్యోదయ పథకాన్ని అమలు చేస్తూ చిట్ట చివర ఉన్న వ్యక్తికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలను చేర్చే విధంగా గరీబ్ కళ్యాణ్ యోజన అమలు చేస్తూ దేశ అభివృద్ధి కోసం నిత్యం పాటుపడుతున్నారని ఆయన అన్నారు. పేద ప్రజల అభివృద్ధి ధ్యేయంగా ప్రధానమంత్రి కిసాన్ సమాన్ నిధి ద్వారా రైతులకు ఆయుష్మాన్ భారత్ ద్వారా ప్రతి కుటుంబ ఆరోగ్యం కోసం మరియు పేద ప్రజల ఆకలి తీర్చడానికి ప్రతి పౌరుడికి గత ఐదు సంవత్సరాల నుంచి ఉచితంగా బియ్యం గోధుమలు అందిస్తూ దేశ ప్రజల అవసరాలను తీరుస్తూ ఎప్పటికప్పుడు కొత్త పథకాలను తీసుకువస్తూ దేశాన్ని విశ్వ గురువుగా తీర్చిదిద్దాలని ఆశయంతో పనిచేస్తున్నారని కార్యకర్తలు కూడా ఇదే సంకల్పంతో పనిచేసి భారతీయ జనతా పార్టీని వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో గెలిపించుకొని డబుల్ ఇంజన్ సర్కార్ తెచ్చుకునే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు. పింగిలి సంపత్ రెడ్డి. కుందూరు మల్లారెడ్డి. చెంగల చిరంజీవి. సుల్తాన్ రాజు. వంగాల రాజేందర్ రెడ్డి. ఇటికాల ప్రశాంత్. వడ్డే దేవేందర్. మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఎంఎన్ఓ రాజమౌళి కుటుంబానికి పరామర్శ--ఆర్థిక సహాయం అందజేత

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**



భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో ఎంఎన్ఓగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేల్పుల రాజమౌళి కుటుంబాన్ని ఆసుపత్రి అధికారులు పరామర్శించారు.ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్,అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ యాదగిరి, డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటరత్నం, నర్సింగ్ గ్రేడ్ వన్ ఆఫీసర్ ఉమేశ్వరి, నర్సింగ్ సూపరింటెండెంట్ స్వర్ణలత తదితరులు సోమవారం రాజమౌళి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఈ సందర్భంగా రాజమౌళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అధికారులు,ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.అనంతరం డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ,రాజమౌళి సేవలను స్మరించుకుంటూ ఆయన కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.ఈ పరామర్శ కార్యక్రమంలో ఆర్ఎంవోలు,వైద్యులు,నర్సింగ్ సిబ్బంది,రేడియోగ్రాఫర్లు,ఈసీజీ టెక్నీషియన్లు,ఫార్మసీ ల్యాబ్ టెక్నీషియన్లు,డేటా ఎంట్రీ ఆపరేటర్లు,ఆరోగ్యశ్రీ సిబ్బంది,ఎంఎన్ఓలు,శానిటేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# అద్దె గదిలో అంగన్వాడీ... సమస్యలపై ఫోకస్ -- గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి శ్రావణి ముందడుగు!







**తెలుగు గళం(భద్రాద్రి కొత్తగూడెం ఏప్రిల్ 07)**
కొత్తగూడెం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని 21వ డివిజన్ సుందరయ్యనగర్ కాలనీలో ఉన్న సుజాతనగర్-4 అంగన్వాడీ కేంద్రాన్ని స్థానిక కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సెంటర్‌కు హాజరవుతున్న గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల వివరాలను స్వయంగా తెలుసుకొని, వారికి అందిస్తున్న పోషకాహారం నాణ్యత, పంపిణీ విధానం, అందుబాటుపై విపులంగా విచారణ చేశారు.అంగన్వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న రిజిస్టర్లు, లబ్ధిదారుల వివరాలు పరిశీలించిన శ్రావణి, ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతి ఒక్కరికీ పోషకాహారం సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఎక్కడైనా నిర్లక్ష్యం ఉంటే సహించబోమని హెచ్చరించారు.చిన్నారులకు అందిస్తున్న విద్యా బోధన విధానం, వారికి ఇస్తున్న పౌష్టికాహారం పై కూడా ఆమె ప్రత్యేకంగా దృష్టి సారించారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను గుర్తుచేస్తూ, విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని, పిల్లల ఆరోగ్యం విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని సూచించారు.ఈ సందర్శనలో భాగంగా 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతులకు అవసరమైన చిక్కిలను అందజేసి, వారి ఆరోగ్య పరిరక్షణపై శ్రద్ధ చూపారు. యువతుల్లో పోషకాహార లోపం నివారణకు తీసుకుంటున్న చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఇక అంగన్వాడీ సిబ్బంది తమ సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. సెంటర్ ప్రారంభమైనప్పటి నుండి అద్దె ఇంట్లోనే చాలీచాలని గదిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నామని, సరైన భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. దీనిపై స్పందించిన కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి అంగన్వాడీకి పక్కా భవనం నిర్మాణం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ పర్యటనతో స్థానికంగా విశ్వాసం పెరిగింది. మహిళలు, చిన్నారుల సంక్షేమం పట్ల కార్పొరేటర్ చూపుతున్న చొరవకు ప్రజలు అభినందనలు తెలియజేస్తున్నారు.

# చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ భూ సేకరణ పారదర్శకంగా నిర్వహించాలి--కలెక్టర్ రాహుల్ శర్మ



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు అవసరమైన భూ సేకరణ ప్రక్రియను రైతులతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో రెవెన్యూ,సర్వే,ఇరిగేషన్,మెగా శాఖల అధికారులతో భూ సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రాజెక్ట్ పరిధిలోకి వచ్చే గ్రామాల్లో ముందస్తుగా షెడ్యూల్ రూపొందించి గ్రామ సభలను నిర్వహించాలని సూచించారు. గ్రామ సభల్లో రైతుల నుండి వచ్చే అభ్యంతరాలను సమగ్రంగా పరిశీలించి,సమస్యలకు తగిన పరిష్కారాలు చూపాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌కు సంబంధించిన భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని,ప్రాజెక్ట్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దశలవారీగా అమలు చేయాలని సూచించారు.ప్రాధాన్యత క్రమంలో సంబంధిత ప్రాంతాల్లో భూములను సేకరించడం ద్వారా పనులు సకాలంలో పూర్తి చేయవచ్చని పేర్కొన్నారు.ప్రాజెక్ట్‌కు అనుబంధంగా కాలువలు ఇతర అవసరాల కోసం కూడా భూములు సేకరించబడుతున్నాయని,సాగు మరియు త్రాగునీటి అవసరాలను తీర్చడం ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు.ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎస్డీసీ రమేష్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమకుమారి, ఇరిగేషన్, రెవెన్యూ, మెగా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రేపాక హత్య కేసు ఛేదన--ఇద్దరు నిందితులు అరెస్ట్




**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

రేగొండ మండలంలోని రేపాక గ్రామంలో జరిగిన హత్య కేసును పోలీసులు వేగంగా ఛేదించారు.ఈ ఘటనకు సంబంధించిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.వాహనాల తనిఖీ సమయంలో నిందితులు పట్టుబడటం గమనార్హం.పోలీసుల వివరాల ప్రకారం, రేపాక గ్రామానికి చెందిన కుర్ర చేరాలు (55) అనే వ్యక్తిపై అతని కుమారులు కుర్రే రామ్, లక్ష్మణ్‌లు శనివారం అర్ధరాత్రి సుమారు 1:20 గంటలకు గొడ్డలితో దాడి చేశారు.తీవ్రంగా గాయపడిన చేరాలను ఆసుపత్రికి తరలించగా, ఆదివారం ఉదయం చికిత్స పొందుతూ మరణించాడు.దర్యాప్తులో మృతుడు గ్రామానికి చెందిన ఓ మహిళతో అక్రమ సంబంధం కొనసాగించడం వల్ల కుటుంబంలో విభేదాలు తలెత్తినట్లు, అదే కారణంగా పూర్వ వైరం పెరిగి నిందితులు ముందస్తు ప్రణాళికతో ఈ హత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.ఘటన అనంతరం పరారైన నిందితులను భూపాలపల్లి సీఐ డి. నరేష్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చేపట్టాయి.ఈ క్రమంలో రేగొండ చెక్‌పోస్ట్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు.విచారణలో వారు తమ నేరాన్ని ఒప్పుకున్నారు.నిందితుల వద్ద నుండి హత్యకు ఉపయోగించిన గొడ్డలి, రక్తపు మరకలతో ఉన్న బట్టలు, టూ వీలర్ వాహనం (టీజీ 08 పి 5807), రెండు మొబైల్ ఫోన్లు, అలాగే బాధిత మహిళ నుండి అపహరించిన సుమారు 25 గ్రాముల బంగారు పుస్తెల తాడు స్వాధీనం చేసుకున్నారు.ఈ కేసును త్వరితగతిన ఛేదించిన భూపాలపల్లి సీఐ డి. నరేష్ కుమార్, ఘనపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్. కరుణాకర్ రావు, రేగొండ ఎస్సై డి. సుధాకర్,పోలీస్ సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.

# సమాజ సేవకు శిఖర గౌరవం -- రవీంద్రభారతిలో కోటపాటి రుక్మారావుకు "దళితరత్న" అవార్డు








**తెలుగు గళం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రతినిధి (ఏప్రిల్ 07)**

హైదరాబాద్‌లోని ప్రతిష్టాత్మక సాంస్కృతిక వేదిక రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించిన కార్యక్రమంలో సమాజ సేవలో విశేష కృషి చేస్తున్న కోటపాటి రుక్మారావుకు "దళితరత్న" అవార్డు ప్రదానం చేశారు. ఈ అవార్డు ఆయన దళితుల అభ్యున్నతి, విద్యాభివృద్ధి మరియు సామాజిక చైతన్యానికి అందించిన సేవలకు గుర్తింపుగా ఇవ్వబడింది.తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మరియు బాబు జగ్జీవన్ రామ్ 119వ జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం ఘనంగా సాగింది. విద్యార్థుల సంక్షేమం, ముఖ్యంగా హాస్టల్ విద్యార్థుల అభివృద్ధి, యువతలో మార్గనిర్దేశం మరియు సమాజంలో చైతన్యం కల్పించడంలో రుక్మారావు చేసిన సేవలను సభలో విశేషంగా కొనియాడారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు డైరెక్టర్ సి. శ్రీధర్ మాట్లాడుతూ, వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వ్యక్తులను గుర్తించి ప్రోత్సహించడం సమాజ పురోగతికి కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి అవార్డులు మరింత మందిని సేవా దృక్పథంతో ముందుకు తీసుకువస్తాయని తెలిపారు.బాబు జగ్జీవన్ రామ్ జయంతోత్సవ కమిటీ కో-కన్వీనర్ దొమ్మాటి సుదర్శన్ బాబు మాట్లాడుతూ, రుక్మారావు గత 15 సంవత్సరాలుగా నిరంతరం దళితుల విద్యా అభివృద్ధి, సామాజిక అవగాహన కార్యక్రమాలు, యువతకు మార్గనిర్దేశం వంటి రంగాల్లో అంకితభావంతో పనిచేస్తున్నారని అన్నారు.అవార్డు స్వీకరించిన అనంతరం రుక్మారావు మాట్లాడుతూ, "ఈ గౌరవం నాకు మరింత బాధ్యతను గుర్తు చేస్తోంది. హాస్టల్ విద్యార్థుల సంక్షేమం, సమాజ సేవలో నా కృషిని మరింత విస్తరించేందుకు కట్టుబడి ఉన్నాను. 'పే బ్యాక్ టు ద సొసైటీ' నా లక్ష్యం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో శాఖకు చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు. రుక్మారావు ఈ గౌరవం అందుకోవడం పట్ల వివిధ వర్గాల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి

# రైతుల బోనస్ చెల్లింపులపై ఆగ్రహం--పరిష్కారం లేకపోతే ఉద్యమం:రవి పటేల్ హెచ్చరిక



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు రవి పటేల్ ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై సమావేశం జరిగింది.ఈ సందర్భంగా జిల్లాలోని పలువురు రైతులు వర్షాకాలం వరి పంటకు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ డబ్బులు ఇప్పటివరకు తమ ఖాతాల్లో జమ కాలేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.రైతులు మాట్లాడుతూ,సమస్య పరిష్కారం కోసం పలుమార్లు వ్యవసాయ శాఖ అధికారులను,బ్యాంకులను సంప్రదించినప్పటికీ ఎలాంటి ఫలితం రాలేదని తెలిపారు.కలెక్టర్‌కు కూడా పలుమార్లు వినతిపత్రాలు అందజేసినా స్పందన లేకపోవడం బాధాకరమని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో రైతుల సమస్యను ముందుకు తీసుకెళ్లిన రవి పటేల్,కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో సన్నవల పంటలకు క్వింటాల్‌కు ?500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చి,ఇప్పటివరకు అమలు చేయకపోవడం దురదృష్టకరమని విమర్శించారు.రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పించడం అన్యాయం అని ఆయన అన్నారు.జిల్లా కలెక్టర్,సంబంధిత వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించి రైతుల బోనస్ సమస్యను పరిష్కరించాలని రవి పటేల్ డిమాండ్ చేశారు.లేనిపక్షంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో ధర్నాలు, నిరసనలు చేపడతామని హెచ్చరించారు.ప్రకృతి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని పంటలు పండిస్తున్న రైతులకు అధికారులు న్యాయం చేయాల్సిన బాధ్యత ఉందని, ఏ ప్రభుత్వం వచ్చినా రైతుల సమస్యలను నిర్లక్ష్యం చేయడం సరికాదని ఆయన అన్నారు. రైతులకు ఎలాంటి సమస్య వచ్చినా తెలంగాణ రాజ్యాధికార పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.అయితే గడువు లోపు సమస్య పరిష్కారం కాకపోతే జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని రవి పటేల్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు,రైతులు పాల్గొన్నారు.

# గుండెపోటుతో పంచాయతీ కార్మికుడు మృతి



**పెన్‌పహాడ్, ఏప్రిల్ 06** : పెన్‌పహాడ్ మండల కేంద్రంలో పనిచేసే పంచాయతీ కార్మికుడు ఒగ్గు మట్టయ్య (55) సోమవారం ఉదయం 5 గంటలకు గుండెపోటుతో మృతిచెందాడు. మట్టయ్యకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని సీఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మట్టయ్య గత కొన్ని సంవత్సరాలుగా గ్రామంలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తూ గ్రామాభివృద్ధికి ఎంతో కృషి చేశాడన్నారు. ఆయన అకాల మరణం సీఐటీయూకు కార్మిక సంఘానికి తీరని లోటు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ద్వారా రూ.5 లక్షలు వారి కుటుంబానికి ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలన్నారు.

కార్మికులు గ్రామ అభివృద్ధి కోసం ఎంతో పని చేస్తున్నటువంటి కార్మికుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వ్యవహరించడంతో అనేకమైన ఆరోగూ.25 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఒగ్గు రవి. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాసు, నకరికంటి నరసయ్య, సత్యం, నరేశ్, సత్తమ్మ, రేణుక, ఎల్లమ్మ, వెంకన్న, వీరస్వామి, సైదులు, రవి, శీను పాల్గొన్నారు.

# నిబద్ధత గల మార్క్సిస్ట్.యర్రా శ్రీకాంత్ ఆయన ఆశయు సాధన కోసం కృషి చేద్దాం.

- సిపిఐ ఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం
- రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊసరవెల్లి : పోతినేని సుదర్శన్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు
- నిరంతరం పోరాటయోధుడు యర్రా శ్రీకాంత్ : నున్న నాగేశ్వరరావు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి










**తెలుగు గళం న్యూస్, ఖమ్మం పట్టణం ఏప్రిల్ 07, ఖమ్మం జిల్లా :**

పార్టీ తనకు అప్పగించిన పనిని ఎన్ని ఆటు ఓట్లు వచ్చినా దానిని పూర్తి చేసేవరకు విశ్రామించని మార్క్సిస్టు యర్రా శ్రీకాంత్ అని సిపిఐ ఎం కేంద్రకమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు.అమరజీవి యర్రా శ్రీకాంత్ వర్ధంతి సభ సోమవారం స్థానిక బోస్ సెంటర్ లో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రం అద్యక్షతన జరిగింది.ఈ సభకు తమ్మినేని ముఖ్య అతిథి గా హాజరై మాట్లాడారు.గతంలో త్రీ టౌన్ ప్రాంతం నుండి మార్కెట్ తరల కుండా ఇక్కడే వుండేలా పోరాడి విజయం సాధించిన వ్యక్తి శ్రీకాంత్ అని అన్నారు.తాను జిల్లా కార్యదర్శి గా పని చేసిన కాలంలోశ్రీ కాంత్ పోరాట పటిమ ను దగ్గర వుండి చూసానన్నారు.ఖమ్మం నగరం లో పార్టీ ఆదేశాల మేరకు జరిగిన ఇళ్ళ స్థలాల పోరాటంలో శ్రీకాంత్ ముందుండే వారన్నారు.ఖమ్మం నగరంలో కార్మిక రంగం బలోపేతం కోసం ఆయన చేసిన కృషి మాటలతో చెప్ప లేమన్నారు.అదేవిధంగా పార్టీ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పాదయాత్ర,నిరాహార దీక్షలతో పాటు జైలు జీవితం కూడా గడిపిన పోరాట యోధుడు అని కొనియాడారు నేడు జాతీయంగా అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాలలో సిపిఎం పార్టీ స్పష్టమైన వైఖరితో పోరాటాలు చేస్తుందని ఇరాన్ పై అమెరికా ఇజ్రాయిల్ దురాక్రమ దాడులు కొనసాగిస్తుందని చమురు పై ఆదిపత్యం కోసం యుద్ధాలు చేస్తుందని దానిలో భాగమే అమెరికా. ఇజ్రాయిల్ కలిసి ఇరాన్ పై దాడి చేస్తున్నాయి వందలాదిమంది ప్రజల ప్రాణాలను బలి తీస్తున్నాయి ట్రంపు ఆదేశాలకు కీలుబొమ్మగా భారతదేశంలో ప్రధాని మోడీ వివరిస్తున్నారు అని తమ్మినేని అన్నారు ప్రధాని మోడీ తప్పుడు విధానాల ఫలితంగా దేశం ఆర్థిక సంక్షోభంలోకి పోతుందని రైతులు కార్మికులు వ్యవసాయ కూలీలు ఆర్థిక ఇబ్బందులు గురవుతున్నారని మోడీ తప్పుడు విధానాలు వ్యతిరేకంగా కార్మిక వర్గం పోరాటంలో భాగస్వామ్యం కావటమే కామ్రేడ్ యర్రా శ్రీకాంత్ కు ఇచ్చే నిజమైన నివాళులు అని అన్నారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ కామ్రేడ్ ఎర్ర శ్రీకాంత్ ఐదు దశాబ్దాల పాటు కమ్యూనిస్టు ఉద్యమంలో పేద ప్రజల కోసం వారి సమస్యలు పరిష్కారం కోసం విద్యార్థి దశ నుండి ఉద్యమాలు నిర్వహించిన వ్యక్తిని మంచి కమ్యూనిస్టు అంటే ఎర్ర శ్రీకాంత్ అని అన్నారు నేడు కమ్యూనిస్టులపై అనేకమంది దుష్ప్రచారం చేస్తున్నారని కమ్యూనిస్టులు అంటే నాకెంతో గౌరవం. కమ్యూనిస్టు పోరాటాలు స్ఫూర్తిదాయకమని పేద ప్రజలు కష్టజీవుల పక్షాన ఉంటారని అన్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలో జరుగుతున్న ఎన్నికల ప్రచారం కోసం వెళ్లి అక్కడ ప్రభుత్వం కొనసాగిస్తున్న వామపక్ష ప్రభుత్వం పై ముఖ్యమంత్రి పిన్నరై విజయను పై చౌకబారు విమర్శలు చేస్తూ ఊసరవెల్లి లాగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మారారని విజయను కు ఓటు వేస్తే మోడీకి ఓటు వేసినట్లు అని దుష్ప్రచారం చేయటం దారుణం నేడు దేశంలో మతోన్మాదం పెరగడానికి ప్రధాన కారణం కాంగ్రెస్ బాబ్రీ మసీద్ కూల్చివేత నుండి నేటి వరకు కాంగ్రెస్ బిజెపికి బీటింగా వ్యవహరించడమే మతోన్మాదం పెరగటానికి కారణం ఇలా ఉంచుకొని సిపిఎం పై విమర్శలు చేయటం రేవంత్ రెడ్డికి సరైనది కాదని అన్నారు మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా కార్పోరేట్ ప్రైవేటుగా వ్యతిరేకంగా కార్మిక వర్గ పోరాటాలు మరింత బలోపేతం చేయటమే కామ్రేడ్ ఎర్ర శ్రీకాంత్ కి ఇచ్చే ఘనమైన నివాళులు అని అన్నారు.. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం నగరం సీఐటీయూ నాయకుడిగా అనేక కార్మికుల సమస్యలపై పోరాడి యాజమాన్యాలను ఒప్పించి విజయం సాధించిన వ్యక్తి అని శ్లాఘించారు.ముఖ్యంగా ప్రతిసారి కూలీ రేట్లు పెంపు విషయంలో కార్మికులకు యాజమాన్యాలకు వారధి లా పని చేసి రేట్లు పెంచేలా కృషి చేశారని తెలిపారు.ప్రజలకు సేవ కార్మికొద్యమాన్ని బలోపేతం చేసిన వ్యక్తి అని అన్నారు.మార్కెట్,ఎఫ్ సి ఐ,కిరానం ఇలా పలు రంగాల కార్మికుల సమస్యల పరిష్కారానికి,వారి కూలీ రేట్ల పెంపు విషయం లో రాజీ లేని పోరాటం చేసిన వ్యక్తి శ్రీకాంత్ అని పేర్కొన్నారు.అటువంటి శ్రీకాంత్ భౌతికంగా మన మధ్య లేక పోయినా కార్మికుల ఉద్యమాల్లో ఆయన పేరు తప్పకుండా వినిపిస్తుందని అన్నారు.ప్రస్తుత కార్మికులు ఆయన స్ఫూర్తి తో ముందుకు సాగాలని పిలుపు నిచ్చారు. నిత్య విద్యార్థి శ్రీకాంత్,నున్నా నాగేశ్వర రావు,సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి అమరజీవి శ్రీకాంత్ నిత్య విద్యార్థి అని,ప్రతీ నిత్యం పార్టీ సాహిత్యాన్ని చదివేవారన్నారు.తద్వారా పార్టీ అప్పగించిన పనిని చేస్తూ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసేవారన్నారు.అటువంటి వ్యక్తిని,క్రమశిక్షణ కలిగిన వ్యక్తిని కోల్పోవడం పార్టీ కి తీరని లోట న్నారు.ఆయన కుటుంబానికి తీరని లోటని.శ్రీకాంత్ కోరుకున్న విధంగా కార్పొరేషన్ లో పార్టీ ప్రాబల్యం వుండేలా శ్రేణులు పనిచేయాలని పిలుపు నిచ్చారు. సభకు ముందు మార్కెట్ నుంచి బోస్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుబండి రమేష్, బుగ్గ వీటి చర్ల సీనియర్ నాయకులు పొన్నం వెంకటేశ్వరరావుజిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు, బొంతు రాంబాబు,భూక్యా వీరభద్రం,మదుపల్లి గోపాల్ రావు,బండి పద్మ,జిల్లా కమిటీజబ్బార్,మీరా, తిరుపతి రావు,నవీన్ రెడ్డి, భూక్యా శ్రీనివాసరావు వజినేపల్లి శ్రీనివాసరావు,బోడ పట్ల సుదర్శన్,ఎస్. కె నాగుల మీరా, బత్తిని ఉపేందర్,రాజు వజనేపల్లి శ్రీనివాసరావు బండారు యాకయ్య బండారు రమేష్,సైదులు, ఎర్ర రమేష్ ఎర్ర గోపి ఎల్లంపల్లి వెంకట్రావు బండి పద్మ పత్తిపాక నాగ సులోచన రంజిత్ ఎస్ కే సైదులు ఎస్ నవీన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

– **కార్మిక పక్ష పాతి:ఎం.సాయిబాబా,సిపిఎం ఆలిండియా కమిటీ సభ్యులు**

చేసేందుకు పార్టీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం ఎక్కువగా ఉండాలని కోరుకునే వారని,ఆదిశగా ప్రతీ నాయకుడు,కార్యకర్త కృషి చేయాలనీ పిలుపు నిచ్చారు.అటువంటి ఆయన మరణం పార్టీ కి తీరని లోటన్నారు.పార్టీ శ్రేణులు ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు నిచ్చారు.

తాను నమ్మిన సిద్ధాంతం లో భాగంగా కార్మిక పక్షపాతి గా చివరి వరకు నిలిచిన వ్యక్తి శ్రీకాంత్ అని సిపిఐ(ఎం)ఆలిండియా కమిటీ సభ్యులు యం సాయి బాబా అన్నారు. ఖమ్మం నగరంలో

# సరస్వతి అంత్య పుష్కరాలకు సమగ్ర ఏర్పాట్లు

**- భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు:ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్**







**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా కాళేశ్వరానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేపట్టాలని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులను ఆదేశించారు.సోమవారం కాళేశ్వరంలో ఆమె దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు,జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ధార్మిక సలహాదారు గోవింద హరిలతో కలిసి సరస్వతి ఘాట్, మ్యూజియం అక్కడ ఏర్పాటు చేయనున్న విగ్రహాలను పరిశీలించారు.అనంతరం ఈఓ కార్యాలయంలో దేవాదాయ,ఇరిగేషన్,ఆర్ అండ్ బి, పీఆర్ ఇంజినీరింగ్,విద్యుత్తు,మిషన్ భగీరథ, వైద్య,ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,శాశ్వత తాత్కాలిక పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా శైలజా రామయ్యర్ మాట్లాడుతూ,భక్తులకు తాత్కాలిక మరుగుదొడ్లు,సురక్షిత తాగునీటి సదుపాయం కల్పించాలని మిషన్ భగీరథ అధికారులకు సూచించారు.గత పుష్కరాల్లో ఎదురైన సమస్యలు పునరావృతం కాకుండా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని,పారిశుద్ధ్య నిర్వహణను పకడ్బందీగా చేపట్టాలని ఆదేశించారు.మొత్తం 540 మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలని,వాటి స్థానాలు,సామర్థ్యంపై స్పష్టమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు.ఘాట్ వద్ద క్లాడింగ్, రైలింగ్ ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ అధికారులకు, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని దేవాదాయ శాఖ ఇంజినీర్లకు సూచించారు.మే మొదటి వారంలో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.హెలిప్యాడ్, బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు నదిలో భక్తుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు.భక్తులు పుణ్యస్నానాలు చేసేందుకు అనువుగా మాట్స్, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, 12 రోజుల పాటు హారతి కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. దేవాలయాన్ని విద్యుద్దీకరణ చేయడంతో పాటు పబ్లిక్ అడ్రెస్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు కూడా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.కాళేశ్వర మహత్యంపై తెలుగు,ఇంగ్లీష్,హిందీ భాషల్లో పుస్తకాలు ప్రచురించాలన్నారు.పీఠాధిపతుల ఆధ్వర్యంలో యాగాలు నిర్వహించేందుకు షెడ్యూల్ సిద్ధం చేయాలని, ఆహ్వాన పత్రికలు రూపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ధార్మిక సలహాదారు గోవింద హరి, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం నిర్వహణ





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.జిల్లా అధ్యక్షుడు ఏడు నూతుల నిషిధర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నిషిధర్ రెడ్డి మాట్లాడుతూ,1980 ఏప్రిల్ 6న మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలో భారతీయ జనతా పార్టీ స్థాపించబడిందని గుర్తుచేశారు.గత 47 ఏళ్లలో పార్టీ ఎన్నో విజయాలు సాధించి,కార్యకర్తల కృషి,త్యాగాల ఫలితంగా కేంద్రంలోనే కాకుండా అనేక రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని తెలిపారు. ఈ స్థాయికి తీసుకువచ్చిన ప్రతి నాయకుడికి కృతజ్ఞతలు తెలిపారు.“నేషన్ ఫస్ట్ -- పార్టీ నెక్స్ట్ - - సెల్ఫ్ లాస్ట్” అనే సిద్ధాంతంతో ప్రజా సేవే లక్ష్యంగా పార్టీ ముందుకు సాగుతుందని,పార్టీ అభివృద్ధిలో కీర్తిశేషులు చందుపట్ల జంగా రెడ్డి పాత్రను స్మరించుకున్నారు.దేశంలోని ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పార్టీ కార్యకర్తలు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం సుపరిపాలన దిశగా ముందుకు సాగుతుందని,అవినీతి,బంధుప్రీతకులమత రాజకీయాలకు ముగింపు పలుకుతూ అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని పేర్కొన్నారు.రానున్న రోజుల్లో దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కూడా పార్టీ అధికారంలోకి వస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పార్లమెంట్ కో కన్వీనర్ లింగంపల్లి ప్రసాద్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దొంగల రాజేందర్, పెండ్యాల రాజు,తాడికొండ రవి కిరణ్,జిల్లా ఉపాధ్యక్షులు దాసరి తిరుపతి రెడ్డి,కార్యాలయ కార్యదర్శి వట్టం తిరుపతి, మీడియా ఇంచార్జ్ మునెందర్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గాలీఫ్,ఓబీసీ జిల్లా అధ్యక్షుడు తీగల జగ్గయ్యతో పాటు పలువురు నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు

# ఆరోగ్య వారోత్సవాలు ప్రారంభం

**వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి:కలెక్టర్ రాహుల్ శర్మ**










**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో నిర్వహిస్తున్న ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా ప్రజలు వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలు,వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు.సోమవారం భూపాలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు “ఈట్ రైట్ వాక్” కార్యక్రమాన్ని నిర్వహించి వారోత్సవాలకు శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఏప్రిల్ 6 నుండి 11వ తేదీ వరకు జిల్లాలో ఆరోగ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయడం,ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం,వైద్య సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం లక్ష్యంగా ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు.ప్రతి రోజుకు ప్రత్యేక థీమ్‌ను నిర్ణయించి,ఆ థీమ్‌కు అనుగుణంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.వారోత్సవాల షెడ్యూల్ ప్రకారం,ఏప్రిల్ 6న ఆహార భద్రత దినంగా జరుపుతూ ఆహార భద్రత నిబంధనలపై అవగాహన కల్పిస్తారు.7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా సమగ్ర ఆరోగ్య సేవలపై దృష్టి సారిస్తారు.8న ఎయిడ్స్ అవగాహన దినంగా హెచ్ఐవి నిరోధంపై కార్యక్రమాలు చేపడతారు.9న సురక్షిత మాతృ దినంగా తల్లి–శిశు ఆరోగ్యంపై చర్యలు తీసుకుంటారు.10న ఆయుష్ దినంగా యోగా,హోమియోపతి వంటి ప్రత్యామ్నాయ వైద్య విధానాలను ప్రోత్సహిస్తారు.11న మాదకద్రవ్యాల నియంత్రణ దినంగా వ్యసనాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పిస్తారు.ఈ వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రులు,కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాలు,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు,ఉప కేంద్రాలలో ఆరోగ్య శిబిరాలు,స్క్రీనింగ్ పరీక్షలు,పోషకాహార సలహాలు,గృహ సందర్శనలు,ప్రసూతి శిబిరాలు,యోగా శిబిరాలు,ఆయుష్ వైద్య సేవలు మాదకద్రవ్యాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని కలెక్టర్ వివరించారు.ఆహార భద్రత అధికారులు,ఎన్సీడీ ప్రోగ్రామ్ సిబ్బంది,జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు,ఆయుష్ విభాగం ఇన్‌చార్జ్‌లు,డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు ఈ కార్యక్రమాల అమలులో కీలక పాత్ర పోషిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.మధుసూదన్,ఆహార తనిఖీ అధికారి వరుణ్ రెడ్డి,ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు..

# ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం సహించం- -కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరిక





**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**
భూపాలపల్లి జిల్లాలో ప్రజావాణి ద్వారా అందుతున్న దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులు స్పష్టంగా హెచ్చరించారు.సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుండి మొత్తం 80 దరఖాస్తులను స్వీకరించారు.ఈ దరఖాస్తులను తక్షణమే పరిష్కరించే దిశగా సంబంధిత శాఖల అధికారులకు ఎండార్స్మెంట్‌లు జారీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై సమీక్ష నిర్వహించారు.కాటారం సబ్ కలెక్టర్ కార్యాలయం,డిపిఓ,డిఆర్డీఓ,పీఆర్ ఈఈ,మున్సిపాలిటీ,ఆర్డీఓ,విద్యుత్ శాఖ,ఎస్సీ అభివృద్ధి శాఖ,విద్యాశాఖ,సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖలలో పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను వచ్చే వారం లోగా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని అధికారులకు ఆదేశించారు.దరఖాస్తుల పరిష్కారంలో తగిన ప్రగతి కనిపించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.సుదూర ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమానికి వస్తున్నారని,వారి సమస్యలు ఆలస్యమైతే ప్రభుత్వ యంత్రాంగంపై నమ్మకం దెబ్బతింటుందని ఆయన పేర్కొన్నారు.అందువల్ల ప్రతి అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్,అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్,విజయలక్ష్మి, ఆర్డీఓ హరికృష్ణతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# రేషన్ షాప్ లు ఆకస్మిక తనిఖీ చేసిన వైస్ చైర్మన్ బొంతు.

**సత్తుపల్లి,ఆర్‌సి,ఏప్రియల్06(తెలుగుగళం)న్యూస్:**సత్తుపల్లి పట్టణంలోని కల్పతరు రోడ్ మరియు చింతలపాటి వారి వీధిలో గల రేషన్ షాపులలో సోమవారం సత్తుపల్లి మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత వేణు గారు ఆకస్మిక తనిఖీలు





నిర్వహించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు మూడు నెలల రేషన్ బియ్యం పంపిణీలో భాగంగా లబ్ధిదారుల అభిప్రాయాలను సేకరించారు. పారదర్శక పంపిణీకి కావలసిన సలహాలు, సూచనలు స్వీకరించారు. షాపుల వద్ద వేసవి కాలం దృష్ట్యా టెంటు, మంచినీటి సౌకర్యం వంటివి ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం రేషన్ డీలర్షిప్ ఆథరైజేషన్,బి స్టాక్ పొజిషన్, రోజువారీ పంపిణీ గురించి రికార్డులను పరిశీలించినారు. డీలర్లు నేమ్ ప్లేట్ బోర్డులను ఏర్పాటు చేయాలి మరియు లబ్ధిదారులకు సకాలంలో సరుకులు ఇవ్వాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అందిస్తున్న ముఖ్యంగా సన్నబియ్యం పంపిణీలో అవకతవకలు, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని రేషన్ డీలర్ల ను ఆదేశించారు.

# అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ.

**-నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ**

**-సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక**




**తెలుగు గళం న్యూస్ హైదరాబాద్, ఏప్రిల్ 6** జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో తెలిపారు.దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూటినీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

## ఐపీఎల్ నుంచి బ్యాన్.. శ్రేయాస్ అయ్యర్‌కు బ్యాడ్‌న్యూస్ రానుందా.?




చెన్నైలోని ఎం.ఏ. చిదంబరం స్టేడియంలో శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు నిర్ణీత సమయం కంటే నెమ్మదిగా ఓవర్లు వేసింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళి ప్రకారం, ఇది జట్టు కెప్టెన్ చేసిన రెండో తప్పిదం కావడంతో బోర్డు కఠిన చర్యలు తీసుకుంది. గత మ్యాచ్‌లో 12 లక్షల రూపాయల జరిమానా ఎదుర్కొన్న అయ్యర్‌కు, ఈసారి ఆ మొత్తాన్ని రెట్టింపు చేస్తూ 24 లక్షల రూపాయల జరిమానా విధించారు.

జట్టు సభ్యులపై కూడా వేటు..

నిబంధనల ప్రకారం రెండోసారి తప్పిదం జరిగినప్పుడు కేవలం కెప్టెన్‌పైనే కాకుండా, తుది జట్టులో ఆడిన మిగిలిన ఆటగాళ్లపై కూడా జరిమానా పడుతుంది. ఈ క్రమంలో ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా పంజాబ్ జట్టులోని ప్రతి ఆటగాడికి 6 లక్షల రూపాయలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం (ఏది తక్కువైతే అది) జరిమానాగా చెల్లించాలని బోర్డు ఆదేశించింది. మైదానంలో ఆటగాళ్ల క్రమశిక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని ఐపీఎల్ యాజమాన్యం స్పష్టం చేసింది.నిషేధం ముప్పు తృటిలో మిస్..గతంలో మూడవసారి కూడా స్లో ఓవర్ రేట్ నమోదైతే కెప్టెన్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధించే నిబంధన ఉండేది. అయితే, ఈ ఏడాది నుంచి ఆ నిబంధనలో మార్పులు చేశారు. కొత్త రూల్ ప్రకారం, మూడవ తప్పు జరిగినప్పటికీ కెప్టెన్ తదుపరి మ్యాచ్ ఆడవచ్చు. కానీ, అయ్యర్ ఖాతాలో డెమెరిట్ పాయింట్లు చేరతాయి. ఇవి 36 నెలల పాటు రికార్డులో ఉంటాయి. భవిష్యత్తులో మరిన్ని పాయింట్లు వస్తే దీర్ఘకాలికంగా ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. మ్యాచ్ సమయంలో కూడా శిక్షగా ఒక అదనపు ఫీల్డర్‌ను సర్కిల్ లోపలే ఉంచాల్సి రావడంతో జట్టుకు నష్టం జరుగుతోంది.జరిమానా పక్కన పెడితే, మ్యాచ్‌లో తమ జట్టు ప్రదర్శనపై శ్రేయస్ అయ్యర్ ప్రశంసలు కురిపించాడు. 210 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించడంలో ప్రియాన్ష్ ఆర్య (11 బంతుల్లో 39) అందించిన ఆరంభం అద్భుతమని కొనియాడారు. "ప్రభాసిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఇచ్చిన మెరుపు ఆరంభం వల్ల మాపై ఒత్తిడి తగ్గింది. మధ్య ఓవర్లలో బ్యాటింగ్ చేయడం మాకు సులభమైంది" అని అయ్యర్ పేర్కొన్నాడు. పంజాబ్ కింగ్స్ ఈ మ్యాచ్‌లో 5 వికెట్ల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో దూసుకెళ్తోంది.

## కోహ్లీ క్యాచ్ వదిలేస్తే ఎగిరి గంతేసిన అనుష్క..



ఐపీఎల్ 2026లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు , చెన్నై సూపర్ కింగ్స్ మధ్య జరిగిన మ్యాచ్ కేవలం పరుగుల వరదకే కాదు, మైదానంలో జరిగిన హై డ్రామాకు కూడా వేదికైంది. ముఖ్యంగా విరాట్ కోహ్లీ బ్యాటింగ్ చేస్తున్నప్పుడు జరిగిన కొన్ని సంఘటనలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అటు అనుష్క శర్మ సంబరాలు, ఇటు శివం దూబే అగ్రెసివ్ రియాక్షన్లు మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచాయి. చెన్నైతో జరిగిన ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ కేవలం 28 పరుగులు మాత్రమే చేసినప్పటికీ, ఆట ప్రారంభంలోనే ఆయనకు ఒక భారీ లైఫ్ దొరికింది. ఖలీల్ అహ్మద్ వేసిన మూడో ఓవర్లో కోహ్లీ ఒక భారీ షాట్ కొట్టగా, బంతి నేరుగా లాంగ్ ఆన్ వైపు వెళ్ళింది. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న శివం దూబే ఆ క్యాచ్‌ను చాలా ఈజీగా పట్టేస్తాడని అందరూ అనుకున్నారు. కానీ అనూహ్యంగా దూబే ఆ క్యాచ్‌ను వదిలేశారు. అప్పటికి కోహ్లీ స్కోరు కేవలం 7 పరుగులు మాత్రమే. ఈ క్యాచ్ డ్రాప్ అవ్వగానే స్టాండ్స్‌లో ఉన్న అనుష్క శర్మ ఆనందానికి అవధుల్లేవు. గట్టిగా అరుస్తూ, చప్పట్లు కొడుతూ ఆమె సెలబ్రేట్ చేసుకున్న వీడియోలు ఇప్పుడు నెట్టింట హల్చల్ చేస్తున్నాయి.లైఫ్ దొరికినా కలిసిరాని అదృష్టం.లైఫ్ దొరికిన తర్వాత కోహ్లీ భారీ ఇన్నింగ్స్ ఆడుతాడని ఫ్యాన్స్ ఆశించారు. కానీ అన్షుల్ కంబోజ్ వేసిన ఐదో ఓవర్లో కోహ్లీ మళ్ళీ అదే తప్పు చేశాడు. మరో భారీ షాట్ ఆడబోయి బంతిని సరిగ్గా కనెక్ట్ చేయలేకపోయాడు. ఈసారి కూడా బంతి శివం దూబే దగ్గరికే వెళ్ళింది. అయితే ఈసారి దూబే ఏమాత్రం తప్పు చేయకుండా క్యాచ్‌ను పట్టుకున్నాడు. క్యాచ్ పట్టగానే దూబే సాధారణంగా శాంతంగా ఉంటారు, కానీ ఈసారి మాత్రం ఊహించని విధంగా చాలా అగ్రెసివ్‌గా సెలబ్రేట్ చేసుకున్నారు. తానూ పగ తీర్చుకున్నానన్న రేంజ్‌లో ఆయన చూపించిన రియాక్షన్ కోహ్లీ అభిమానులను ఆశ్చర్యపరిచింది.కోహ్లీ త్వరగానే అవుట్ అయినా, ఆర్సీబీ మిగిలిన బ్యాటర్లు మాత్రం చెన్నై బౌలర్లను చితక్కొట్టారు. దేవదత్ పడిక్కల్ కేవలం 29 బంతుల్లో 50 పరుగులు చేసి ఇన్నింగ్స్‌కు ఊపు తెచ్చాడు. ఇక ఆఖర్లో టిమ్ డేవిడ్ రాక్షస బ్యాటింగ్ చేశాడు. 25 బంతుల్లోనే 8 సిక్సర్లు బాది అజేయంగా 70 పరుగులు చేయడంతో ఆర్సీబీ స్కోరు 250 పరుగులకు చేరుకుంది. ఇది ఈ ఐపీఎల్ సీజన్‌లోనే అత్యధిక స్కోరు కావడం విశేషం. కెప్టెన్ రజత్ పాటిదార్ కూడా 19 బంతుల్లో 48 పరుగులు చేసి తనవంతు సహకారం అందించాడు.

## 10 ఏళ్లుగా ఐపీఎల్ జర్నీ ఒక్క హాఫ్ సెంచరీ లేదు




ప్రస్తుతం 26 ఏళ్ల వయసున్న వాషింగ్టన్ సుందర్, కేవలం 17 ఏళ్ల ప్రాయంలోనే 2017లో ఐపీఎల్ బరిలోకి దిగాడు. తన కెరీర్ ఆరంభం నుంచి మహేంద్ర సింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, ఏబీ డివిలియర్స్ వంటి ప్రపంచ స్థాయి దిగ్గజ ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నాడు. ఆఫ్ స్పిన్ బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ మెరుపులు మెరిపించగల సామర్థ్యం ఉండటంతో ఫ్రాంచైజీలు ఇతనిపై ఎప్పుడూ ఆసక్తి చూపుతుంటాయి.

గణాంకాలు ఏం చెబుతున్నాయి?

వాషింగ్టన్ సుందర్ తన ఐపీఎల్ ప్రయాణంలో ఇప్పటివరకు నాలుగు వేర్వేరు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. పూణే సూపర్ జెయింట్స్‌తో మొదలుపెట్టి, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, సన్‌రైజర్స్ హైదరాబాద్ మీదుగా ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్ జట్టులో కొనసాగుతున్నాడు. సుమారు 68 మ్యాచ్‌లు ఆడిన సుందర్, 47 ఇన్నింగ్స్‌లలో బ్యాటింగ్ చేసే అవకాశం పొంది కేవలం 533 పరుగులు మాత్రమే చేశాడు. ఇందులో అతని అత్యధిక స్కోరు 49 పరుగులు. అంటే కేవలం ఒక్క పరుగు తేడాతో తన తొలి అర్ధశతకాన్ని కోల్పోయాడు.బౌలింగ్ విషయానికి వస్తే, 64 ఇన్నింగ్స్‌లలో బౌలింగ్ చేసి కేవలం 40 వికెట్లు మాత్రమే ఖాతాలో వేసుకున్నాడు. ఒకే ఇన్నింగ్స్‌లో 16 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీయడమే అతని అత్యుత్తమ ప్రదర్శన. ఏ సీజన్‌లోనూ కనీసం 10 వికెట్ల మైలురాయిని కూడా అతను చేరుకోలేకపోవడం గమనార్హం.

గుజరాత్ టైటాన్స్ ఆశలు.. రికార్డు మారుతుందా?ఐపీఎల్ 2026 సీజన్‌లో సుందర్ గుజరాత్ టైటాన్స్ తరపున బరిలోకి దిగుతున్నాడు. ఈ ఏడాది ఆడిన మొదటి రెండు మ్యాచ్‌లలో కేవలం 22 పరుగులు చేసి ఒక వికెట్ మాత్రమే తీశాడు. అయితే జట్టు యాజమాన్యం అతనిపై పూర్తి నమ్మకంతో ఉంది. పదేళ్లుగా ఊరిస్తున్న అర్ధశతకాన్ని, నాలుగు వికెట్ల ప్రదర్శనను ఈ సీజన్‌లోనైనా సాధించి, తనపై ఉన్న 'అన్ లక్కీ' ముద్రను చెరిపేసుకోవాలని ఈ యువ ఆల్ రౌండర్ పట్టుదలతో ఉన్నాడు. లీగ్‌లో నిలదొక్కుకోవాలంటే కేవలం చిన్న చిన్న సహకారాలు సరిపోవని, భారీ ప్రదర్శనలు అవసరమని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## వార్ ఎఫెక్ట్ భారీగా కుదేలైన దేశీయ స్టాక్ మార్కెట్లు



ఇరాన్-ఇజ్రాయెల్, అమెరికా మధ్య ఉద్రిక్తతలతో భారత స్టాక్ మార్కెట్లు కుల్పకూలాయి. మార్కెట్లు ఉదయం ప్రారంభం కాగానే.. జెడ్ స్పీడ్‌లో సూచీలు పతనమయ్యాయి. ఇరాన్, ఇజ్రాయెల్‌లోనే కాకుండా దుబాయ్, ఖతార్ లాంటి దేశాల్లో కూడా ఈ యుద్ధంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో స్టాక్ మారట?్టల్లో అనిశ్చితి నెలకొనడంతో అస్థిరతతో కొనసాగుతున్నాయి. భారత సూచీలపై వార్ తీవ్ర ప్రభావం చూపుతోంది. ఉదయం స్టాక్ మార్కెట్లు ప్రారంభం సమయానికే సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకుపైగా కుప్పకూలింది. సెన్సెక్స్ 1004 పాయింట్లు కోల్పోయి 80,294 వద్ద ట్రేడవుతోంది.తగ్గిన రూపాయి విలువఇక నిఫ్టీ ప్రారంభంతోనే 283 పాయింట్లు నష్టపోయి 24,886 వద్ద కొనసాగుతోంది. ఇక డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ భారీగా పడిపోయింది. ప్రస్తుతం డాలర్‌తో పోలిస్తే 24 పైసలు తగ్గి 91.32 వద్ద కొనసాగుతోంది. ఇక ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2700, నిఫ్టీ 530 పాయింట్లు క్షీణించడంతో ఇన్వెస్టర్లు ఆందోళన పడ్డారు. ఆ తర్వాత కాస్త కోలుకోగా.. భారీ నష్టాల్లోనే కొనసాగుతున్నాయి. మారుతీ సుజుకీ, ఏషియన్ పెయింట్స్ షేర్లు నష్టాల్లో కొనసాగుతున్నాయి. ముడి చమురు ధరలు భగ్గుమనడంతో వాటి షేర్లు పడిపోయాయి. ముడి చమురు ధర 80 డాలర్లపైనే ప్రస్తుతం ట్రేడవుతోంది. క్రిందటి సెషన్‌లో ఇన్వెస్టర్ల నుంచి అమ్మకాల జోరు మొదలైంది. దీంతో నేటి సెషన్‌పై ఇది తీవ్ర ప్రభావం చూపింది.

## రోజుకు కేవలం రూ.45 పొదుపుతో లక్షలు మీ సొంతం




పెట్టుబడిలో భద్రతతో పాటు స్థిరమైన రాబడి కోరుకునే వారికి జీవిత బీమా పథకాలు ఇప్పటికీ విశ్వసనీయ ఎంపికగా ఉన్నాయి. ముఖ్యంగా ుఃఐజ అందించే 'జీవన్ ఆనంద్' (ప్లాన్ నం. 915) పథకం మళ్లీ చర్చలోకి వచ్చింది. బీమా రక్షణతో పాటు పొదుపు ప్రయోజనం కలిపిన ఈ పాలసీ సామాన్యులకు అనుకూలంగా ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ పథకంలో ప్రీమియం భారంగా ఉండదు. ఉదాహరణకు 35 ఏళ్ల వ్యక్తి రూ.5 లక్షల సమ్ అష్యూర్డ్‌తో 35 సంవత్సరాల కాలానికి పాలసీ తీసుకుంటే సంవత్సరానికి సుమారు రూ.16,300 చెల్లించాలి. ఇది నెలకు దాదాపు రూ.1,400 లేదా రోజుకు రూ.45--46 మాత్రమే. దీర్ఘకాలంగా చూస్తే చిన్న మొత్తంతో పెద్ద ఫండ్ సృష్టించే అవకాశం ఉంటుంది.ప్రస్తుత బోనస్ అంచనాల ప్రకారం పాలసీ మెచ్యూరిటీ సమయంలో పెట్టుబడిదారుడికి సుమారు రూ.25 లక్షల వరకు లభించే అవకాశం ఉంది. ఇందులో రూ.5 లక్షల హామీ మొత్తం, దాదాపు రూ.8.60 లక్షల సింపుల్ రివిజనరీ బోనస్, సుమారు రూ.11.50 లక్షల తుది అదనపు బోనస్ ఉంటాయి. ఈ పథకంలో ప్రధాన ఆకర్షణ 'హోల్ లైఫ్ కవర్'. చాలా పాలసీలు మెచ్యూరిటీతో ముగిసిపోతాయి. కానీ జీవన్ ఆనంద్‌లో మెచ్యూరిటీ తర్వాత కూడా రూ.5 లక్షల రిస్క్ కవర్ జీవితాంతం కొనసాగుతుంది. పాలసీదారు తరువాత మఈ పాలసీ సామాన్యులకు అనుకూలంగా ఉందని నిపుణులు రణించినా నామినీకి ఈ మొత్తం చెల్లించబడుతుంది.పన్ను మినహాయింపులుఈ పాలసీ కింద చెల్లించే ప్రీమియం ఆదాయపు పన్ను చట్టం సెక్షన్ 80జ కింద మినహాయింపుకు అర్హం. మెచ్యూరిటీ, మరణ ప్రయోజనం సెక్షన్ 10(10ఝ) ప్రకారం పన్ను రహితం. రెండు సంవత్సరాల తర్వాత పాలసీపై రుణం తీసుకునే అవకాశం కూడా ఉంది. తక్కువ ప్రీమియంతో బీమా రక్షణతో పాటు దీర్ఘకాలిక పొదుపు కోరుకునే వారికి జీవన్ ఆనంద్ పథకం సమతుల్య ఎంపికగా నిలుస్తోంది. అయితే పాలసీ కొనుగోలు చేసే ముందు వ్యక్తిగత ఆర్థిక లక్ష్యాలు, రాబడి అంచనాలు జాగ్రత్తగా పరిశీలించాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

## గోల్డ్ లోన్ తీసుకుంటున్నారా?



అత్యవసర ఆర్థిక అవసరాల కోసం చాలామంది ఎంచుకునే సులభమైన మార్గం గోల్డ్ లోన్. తక్కువ వడ్డీ రేటు, వేగంగా నగదు చేతికి అందడం దీని ప్రత్యేకత. అయితే, బంగారు రుణం తీసుకునే ముందు కొన్ని కీలక అంశాలను పరిశీలించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అవేంటో ఇక్కడ చూద్దాం:1. వడ్డీ రేట్ల మధ్య వ్యత్యాసంబంగారు రుణంపై వడ్డీ రేట్లు బ్యాంకును బట్టి, ఆర్థిక సంస్థను (చీదీఖీజ) బట్టి మారుతుంటాయి. కొన్ని బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తాయి. కానీ వాటి ప్రక్రియ కొంత సమయం తీసుకోవచ్చు. ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలు నిమిషాల్లో లోన్ ఇస్తాయి కానీ వడ్డీ రేట్లు కాస్త ఎక్కువగా ఉండవచ్చు. అందుకే రుణం తీసుకునే ముందే వివిధ బ్యాంకుల వడ్డీ రేట్లను పోల్చి చూసుకోవడం మంచిది.

ఇది కూడా చదవండి: ౨ావతీశీశ్రీ, ణఱవంవశ్రీ ౨ాతీఅఎవ: పెట్రోల్, డీజిల్ ధరల బాదుడు.. ఒక్కసారిగా రూ. 25 పెరిగిన డీజిల్ ధర.. పెట్రోల్‌పై రూ.7.41..!ఇంటి నుండి ఎలుకలను తరిమికొట్టే సింపుల్ చిట్కాలు.. ఇక రమన్నా రావు!

2. లోన్ టు వాల్యూ రేషియో (ూుం ూఅశీ): మీరు కుదువ పెట్టే బంగారం విలువలో ఎంత శాతం నగదును అప్పుగా ఇస్తారో తెలిపేదే ూుం రేషియో. సాధారణంగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (=దీ×) నిబంధనల ప్రకారం, బంగారం మార్కెట్ విలువలో గరిష్టంగా 75% వరకు మాత్రమే రుణం లభిస్తుంది.

ఉదాహరణకు: మీ బంగారం విలువ రూ. 1 లక్ష ఉంటే, మీకు గరిష్టంగా రూ. 75,000 మాత్రమే అప్పుగా వస్తుంది. మార్కెట్ ధరలు తగ్గినప్పుడు బ్యాంకులు అదనపు నగదును చెల్లించమని లేదా మరికొంత బంగారాన్ని కుదువ పెట్టమని కోరే అవకాశం ఉంటుందని గుర్తుంచుకోండి.బంగారు రుణాన్ని తిరిగి చెల్లించడానికి వివిధ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి: జుఓ× పద్ధతి: ప్రతి నెల అసలు, వడ్డీ కలిపి కట్టడం. వడ్డీ మాత్రమే కట్టడం: నెలనెలా కేవలం వడ్డీ కట్టి, గడువు ముగిసిన తర్వాత అసలు మొత్తాన్ని ఒకేసారి చెల్లించడం. మీ ఆర్థిక స్థితికి ఏ పద్ధతి సరిపోతుందో ముందే నిర్ణయించుకోండి. సరిగ్గా ప్లాన్ చేయకపోతే చక్రవడ్డీ పడి భారం పెరుగుతుంది.కేవలం వడ్డీ రేటు మాత్రమే కాకుండా, ఇతర దాగి ఉన్న ఛార్జీలను కూడా గమనించాలి. లోన్ మంజూరు చేయడానికి బ్యాంకులు కొంత ప్రాసెసింగ్ ఫీజును తీసుకుంటాయి. అలాగే మీ బంగారం నాణ్యతను పరీక్షించినందుకు తీసుకునే ఛార్జీలు. అదే వాల్యుయేషన్ ఫీజు. మీరు కుదువ పెట్టిన బంగారం సురక్షితంగా ఉందో లేదో చూసుకోవాలి. ఇన్సూరెన్స్ సౌకర్యం ఉన్న బ్యాంకులను లేదా గుర్తింపు పొందిన సంస్థలను ఎంచుకోవడం ఉత్తమం.గోల్డ్ లోన్ అనేది తక్కువ సమయంలో డబ్బు పొందేందుకు మంచి మార్గమే అయినప్పటికీ, పైన చెప్పిన విషయాలను జాగ్రత్తగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటే మీ బంగారం, డబ్బు రెండూ సురక్షితంగా ఉంటాయి.



అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. హాట్ బ్యూటీ డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు.అలాగే స్పెషల్ సాంగ్ కూడా చేసింది.. అయినా స్టార్ డమ్ అందుకోలేకపోయింది. హాట్ బ్యూటీ డింపుల్ హయాతి 2017లో 'గల్ఫ్' సినిమాతో సినీరంగంలోకి వచ్చింది. ఆతర్వాత 2019లో యురేక సినిమాలో నటించింది. అయినా కూడా గుర్తింపు రాలేదు.అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర ' పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది.అదే సమయంలో వరుణ్ తేజ్ నటించిన 'గద్దలకొండ గణేష్' సినిమాలో 'జర్ర జర్ర ' పాటలో నటించింది. ఈ పాటలో హాట్ లుక్ లో మెరిసి ఆకట్టుకుంది. ఆతర్వాత రవితేజ నటించిన ఖిలాడీ సినిమాలో మరోసారి తన గ్లామర్‌తో ఆకట్టుకుంది. చివరిగా రామబాణం అనే సినిమాలో కనిపించింది.కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. రవితేజ సరసన ఈ చిన్నది భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్.కానీ ఈ సినిమా కూడా హిట్ అవ్వలేదు. రవితేజ సరసన ఈ చిన్నది భర్త మహాశయులకు విజ్ఞప్తి అనే సినిమా చేసింది. కానీ ఈ సినిమా కూడా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయింది. ఇక ఇప్పుడు యంగ్ హీరో శర్వానంద్ తో కలిసి నటిస్తుంది డింపుల్.బోగి అనే టైటిల్ తో తెరకెక్కుతున్న సినిమాలో డింపుల్ హీరోయిన్ గా ఎంపికైంది. మొన్నామధ్య ఈ సినిమా నుంచి గ్లింప్స్ విడుదల చేశారు. ఈ సినిమా పై డింపుల్ ఆశలు పెట్టుకుంది.

## కళ్లతో మాయ చేస్తున్న డింపుల్

డింపుల్ హయాతి



## సైలెంట్‌గా పెళ్లి చేసుకున్న షణ్ముఖ్ జస్వంత్

బిగ్‌బాస్ ఫేమ్, ప్రముఖ యూట్యూబర్ షణ్ముఖ్ జస్వంత్ తన జీవితంలో సరికొత్త ఆధ్యాయానికి శ్రీకారం చుట్టాడు. బ్యాచిలర్ లైఫ్ కు బై బై చెబుతూ వైష్ణవి చోడిశెట్టితో అనే అమ్మాయితో కలిసి మూడు ముళ్ల బంధంలోకి అడుగు పెట్టాడు. అయితే షణ్ముఖ్ కానీ, వైష్ణవి కానీ వారి కుటుంబ సభ్యులు వీరి పెళ్లి పై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. షణ్ముఖ్ జస్వంత్ ఫ్రెండ్, ఓ ఫోటోగ్రాఫర్ తన వెడ్డింగ్ ఫోటోగ్రఫీ పేజీలో షణ్ముఖ్ - వైష్ణవి ల పెళ్లి ఫొటోలను షేర్ చేశాడు.అయితే షణ్ముఖ్ కానీ, వైష్ణవి కానీ వారి కుటుంబ సభ్యులు వీరి పెళ్లి పై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. షణ్ముఖ్ జస్వంత్ ఫ్రెండ్, ఓ ఫోటోగ్రాఫర్ తన వెడ్డింగ్ ఫోటోగ్రఫీ పేజీలో షణ్ముఖ్ - వైష్ణవి ల పెళ్లి ఫొటోలను షేర్ చేశాడు.'నా ప్రాణ స్నేహితుడికి పెళ్లి జరిగింది. ఈ ఫోటోలు తీయడం, వీటిని షేర్ చేయడం చాలా ఎగ్జైటింగ్ గా ఉంది' అంటూ పోస్ట్ చేసాడు షణ్ముఖ్ జస్వంత్ ఫ్రెండ్. దీంతో ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి. 'నా ప్రాణ స్నేహితుడికి పెళ్లి జరిగింది. ఈ ఫోటోలు తీయడం, వీటిని షేర్ చేయడం చాలా ఎగ్జైటింగ్ గా ఉంది' అంటూ పోస్ట్ చేసాడు షణ్ముఖ్ జస్వంత్ ఫ్రెండ్. దీంతో ఈ ఫొటోలు నెట్టింట తెగ వైరలవుతున్నాయి.వీటిని చూసిన పలువురు సినీ సెలబ్రిటీలు, బిగ్ బాస్ కంటెస్టెంట్లు షణ్ముఖ్ - వైష్ణవి లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా షన్ను - వైష్ణవి సైలెంట్ గా కేవలం కుటుంబాలు, సన్నిహితుల మధ్యే ఓ ప్రైవేట్ రిసార్ట్ లో పెళ్లి చేసుకున్నట్టు తెలుస్తుంది.వీటిని చూసిన పలువురు సినీ సెలబ్రిటీలు, బిగ్ బాస్ కంటెస్టెంట్లు షణ్ముఖ్ - వైష్ణవి లకు అభినందనలు, శుభాకాంక్షలు తెలుపుతున్నారు. కాగా షన్ను - వైష్ణవి సైలెంట్ గా కేవలం కుటుంబాలు, సన్నిహితుల మధ్యే ఓ ప్రైవేట్ రిసార్ట్ లో పెళ్లి చేసుకున్నట్టు తెలుస్తుంది.బ్రవరి 25న షణ్ముఖ్ - వైష్ణవిల ఎంగేజ్మెంట్ జరిగింది. కేవలం ఇరు కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులు మాత్రమే ఈ వేడుకకు హాజరయ్యారు. కాగా వీరిది పెద్దలు కుదిర్చిన సంబంధమేనని తెలుస్తోంది.



## ఓ అమ్మాయిని ప్రాణంగా ప్రేమించా కానీ నా పుట్టిన రోజు నాడే

సినిమా ఇండస్ట్రీలో ఎలాంటి బ్యాక్ గ్రౌండ్, గాడ్ ఫాదర్ లేకపోయినా హీరోగా రాణిస్తోన్న వారిలో అడివి శేష్ ఒకడు. మొదటల్లో సహాయక నటుడిగా, విలన్‌గా మెప్పించిన అతను ఇప్పుడు తెలుగులో క్రేజీ హీరోగా రాణిస్తున్నాడు. అంతేకాదు రచయితగా, దర్శకుడిగానూ సత్తా చాటుతున్నాడు. క్షణం, గూఢచారి, ఎవరు, మేజర్, హిట్ 2 సినిమాలతో హీరోగా సక్సెస్ లు అందుకుంటున్న అడివి శేష్ ఇప్పుడు డెకాయిట్ తో మన ముందుకు వస్తున్నాడు. ఇప్పటికే అన్ని హంగులు పూర్తి చేసుకున్న ఈ ప్రేమకథా చిత్రం ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దీంతో సినిమా ప్రమోషన్లలో బిజి బిజీగా ఉంటున్నాడు శేష. వరుసగా ఇంటర్వ్యూలకు హాజరవుతున్నాడు. ఈ సందర్భంగా తన పర్సనల్ అండ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించి పలు ఆసక్తికర విషయాలను పంచుకుంటున్నాడు. తాజాగా ఓ సందర్భంలో తన బ్రేకప్ స్టోరీని కూడా షేర్ చేసుకున్నాడీ యంగ్ అండ్ ట్యాలెంటెడ్ హీరో'కాలేజీ రోజుల్లోనే ఓ పంజాబీ అమ్మాయిని ప్రేమించాను. కొన్నాళ్లు బాగానే నడిచింది. అయితే ఆ తర్వాత ఇద్దరికీ కుదరక విడిపోయాం. విడిపోవడమే ఒక బాధనుకుంటే.. సరిగ్గా నా పుట్టినరోజు నాడే తను వేరొకరిని పెళ్లి చేసుకొని ఆ బాధను మరింత రెట్టింపు చేసింది. అందుకే ఆ తర్వాత రిలేషన్స్‌లో ఉన్నా, వాటిని పెళ్లి వరకూ తీసుకెళ్లే ధైర్యం చేయలేదు. అడిగీ బాగా విసిగి పోయారు. ప్రస్తుతం నా దృష్టి మొత్తం సినిమాలపైనే ఉంది. ఎలాగైనా ఓ ప్రేమ కథా చిత్రంలో నటించాలనుకున్న నా కోరిక 'డెకాయిట్' సినిమాతో తీరనుంది' అని అడివి శేష్ చెప్పుకొచ్చాడు.

## సీరియల్స్ మానేసిన శోభా శెట్టి ఇప్పుడేం చేస్తుందో తెలుసా?



బిగ్ బాస్ తెలుగు రియాలిటీ షోతో మంచి గుర్తింపు తెచ్చుకున్న వారిలో కన్నడ నటి శోభా శెట్టి ఒకరు. బిగ్ బాస్ ఏడో సీజన్ లో కంటెస్టెంట్ గా పార్టిసిపేట్ చేసిన శోభా టైటిల్ గెలవనప్పటికీ తన ఆట, మాట తీరుతో బిగ్ బాస్ ఆడియెన్స్ మనసులు గెల్చుకుంది. ఇక కన్నడ బిగ్ బాస్ సీజన్ 11లోనూ వైల్డ్ కార్డ్ ఎంట్రీ ఇచ్చింది శోభా శెట్టి. అయితే అక్కడ ఎక్కువ రోజులు ఉండలేక వెంటనే బయటకు వచ్చేసింది. కాగా బిగ్ బాస్ కంటే ముందు శోభా శెట్టికి మంచి గుర్తింపు తీసుకొచ్చింది సీరియల్సే. ముఖ్యంగా కార్తీక దీపంలో మోనితగా ఆమె నటనను ఎవరూ అంత ఈజీగా మర్చిపోలేదు. అయితే బిగ్ బాస్ నుంచి బయటకు వచ్చిన తర్వాత ఒక్క సీరియల్ లోనూ కనిపించలేదు శోభ. చివరకు తనకు ఎంతగానో క్రేజ్ తెచ్చిపెట్టిన కార్తీక దీపం సీక్వెల్ (కార్తీక దీపం 2 ఇది నవ వసంతం) లోనూ ఆమె కనిపించలేదు. ఇందులో శోభా పాత్రను గాయత్రి సింహాద్రి రీప్లేస్ చేసింది. అయితే సీరియల్స్ చేయనప్పటికీ అడపా దడపా టీవీ షోస్, ప్రోగ్రామ్స్ లో సందడి చేస్తోందీ అందాల తార. అలాగే సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్ గా ఉంటోంది. ముఖ్యంగా యూట్యూబ్ ఛానెల్ తో ఎక్కువగా ఫ్యాన్స్ కు టచ్ లో ఉంటోంది. ఈ నేపథ్యంలో యూట్యూబ్ ఛానెల్ ద్వారానే శోభా శెట్టికి భారీ ఆదాయం వస్తోందని తెలుస్తోంది.శోభా శెట్టికి సోషల్ మీడియాలో ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువగానే ఉంది. ఆమె యూట్యూబ్ ఛానెల్ కు దాదాపు 7.07 లక్షల మంది సబ్‌స్క్రయిబర్లు ఉన్నారు. ఇక శోభా శెట్టి తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ నకు సంబంధించిన విషయాలను ఎక్కువగా సోషల్ మీడియాలో షేర్ చేస్తోంది. ముఖ్యంగా ఆమె వీడియోలకు యూట్యూబ్ లో మంచి స్పందన వస్తోంది. ఒక్కో వీడియోకు మిలియన్ల కొద్దీ వ్యూస్ వస్తుంటాయి. వీటి ద్వారా నెలకు దాదాపు 10 లక్షల వరకు ఆదాయం వస్తోందని తెలుస్తోంది.

## ఆ హీరో భోళా శంకరుడు



ప్రముఖ నటి హేమ, బాలకృష్ణ వ్యక్తిత్వం, ఆయన సహాయక గుణం గురించి తన అనుభవాలను పంచుకున్నారు. బాలకృష్ణను "భోళా శంకరుడు"గా అభివర్ణించిన హేమ, ఆయన మనసు చాలా మంచిదని, ఎలాంటి కల్లాకపటం ఉండదని తెలిపారు. నటులలో ఆయనంటే తనకు చాలా ఇష్టమని పేర్కొన్నారు. చిరంజీవి, నాగార్జున వంటి నటులతో పోలిస్తే బాలకృష్ణతోనే ఎక్కువ సినిమాలలో నటించానని ఆమె వివరించారు. వెంకటేష్ బాబు కూడా సరదాగా ఉంటారని, భగవద్గీత వంటివి చదివి దైవ భక్తి వైపు మొగ్గు చూపారని, తత్వాలు చెబుతుంటారని హేమ తెలిపారు. బాలకృష్ణ లొకేషన్‌లో ఉంటే వాతావరణం అంతా నవ్వులతో నిండిపోతుందని హేమ చెప్పారు. ఒకానొక సందర్భంలో, తన ఊరికి చెందిన ఒక క్యాన్సర్ రోగి గురించి అర్ధరాత్రి 11:30 గంటలకు బాలకృష్ణకు మెసేజ్ చేశానని, వెంటనే ఆయన స్పందించి మరుసటి ఉదయం పది మంది ప్రముఖ వైద్యులను పంపించారని హేమ గుర్తుచేసుకున్నారు. డాక్టర్లు రోగిని పరీక్షించి, అది చివరి దశ అని చెప్పినప్పటికీ, ఉన్నంతలో మంచి చికిత్స అందించి పంపించారని తెలిపారు. బాలకృష్ణ చేసిన ఈ తక్షణ సహాయం వల్ల తన ఊరి ప్రజల మధ్య తన పరువు, గౌరవం పెరిగాయని హేమ సంతోషం వ్యక్తం చేశారు.

## నువ్వుంటే నా జతగా సీరియల్ ఆగిపోవడానికి కారణం ఆమెనే.



సాధారణంగా బుల్లితెరపై తెలుగు అమ్మాయిలు, అబ్బాయిలు హీరోహీరోయిన్లుగా కనిపించడం చాలా అరుదు. ఇప్పుడు తమిళం, కన్నడ సెలబ్రెటీలు మాత్రమే తెలుగులో అత్యధికంగా సీరియల్స్ చేస్తున్నారు. అలాంటి వారి పోటీని తట్టుకుని తనకంటూ మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నాడు అర్జున్ కళ్యాణ్. చాలా సంవత్సరాలుగా ఇండస్ట్రీలో ఉన్నాడు. ఇటీవల నువ్వుంటే నా జతగా సీరియల్ ద్వారా మరోసారి ప్రేక్షకులను అలరించారు. అయితే మంచి టీఆర్పీ రేటింగ్ ఉన్న సమయంలోనే ఈ సీరియల్ ను ఆపేశారు మేకర్స్. ఇందుకు గల కారణాలను ఇటీవల ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు అర్జున్ కళ్యాణ్. ఓ ఇంటర్వ్యూలో తన కెరీర్ ప్రయాణం, ముఖ్యంగా నువ్వుంటే నా జతగా సీరియల్ లోకి ప్రవేశించడానికి గల కారణాలు, దాని అనుభవాలు, సీరియల్ అకస్మాత్తుగా ముగియడానికి దారితీసిన పరిస్థితుల గురించి ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. తాను మొదట సినిమాలపైనే పూర్తి దృష్టి సారించానని, ఆ క్రమంలో ఆరు, ఏడు టాప్ సీరియల్ ఆఫర్లను తిరస్కరించానని తెలిపారు. తన సినిమా కుషి సరైన రీతిలో విడుదల కాకపోవడం, ప్రమోషన్లు చేసినా ఆదరణ దక్కకపోవడంతో నిరాశ చెందానని చెప్పారు.


Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.